GIRDHARI, RNI Regn.No.TELTEL/2021/80612, Date of Pub - 25th of every month
Date posting - 1st of every month at BPC-IV, Patrika Channel, HYD - 01
Postal Regn.No.HQ/SD/525/2024-2026; Licensed to Post without prepayment
WPP No.PMG/TS/HQR/SC-04/WPP/2024-2026



Edited, printed, published and owned by Swami Sundara Chaitanyananda, Printed at M/s Karshak Print Solutions Pvt. Ltd., Moula Ali, Hyd - 500 040.
IF UNDELIVERED PLEASE RETURN TO :
SUNDARA CHAITANYA ASHRAM
HYDERABAD - 500 043

జూన్ 2025

గిరిధారి

శాశ్వత చందా రూ.1200/-
10 సం॥ లకు












ప్రార్థన



శ్లో॥ భాగీరథి సుఖదాయిని మాతః
తవ జల మహిమా నిగమే ఖ్యాతః ।
నాహం జానే తవ మహిమానం
పాహి కృపామయి మా మజ్ఞానమ్ ॥

ఓ భాగీరథీ! సర్వులకు సుఖమును ప్రసాదించు తల్లీ! నీ జలముల వైభవమును శాస్త్రములు గొప్పగా వర్ణించాయి. నీ వైభవమంతా నాకు తెలియదు. ఓ కృపామయీ! అజ్ఞాని నైన నన్ను రక్షించు తల్లీ!



పండుగలు

27-6-2025 - జగన్నాథ రథయాత్ర

గిరిధారి

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి : 40 సంచిక : 7

వ్యవస్థాపకులు :
శ్రీ స్వామి సుందర చైతన్యానంద

ఇందులో

సంపాదకులు : శ్రీ స్వామి సుందర చైతన్యానంద

జీవిత సభ్యత్వం - రూ. 1200 /-
(10 సంవత్సరములు)

డి.టి.పి. & కవర్ డిజైన్
సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్

ప్రింటింగు : బైండింగు
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్

వివరములకు : సుందర చైతన్యాశ్రమం,
దుండిగల్ రోడ్, హైదరాబాద్ - 500 043. ఫోన్:(08418)255777, 9100908777

Visit us at : www.sundarachaitanyam.com (email : admin@sundarachaitanyam.org)



ఆప్తవాక్యం

నాకు తెలుసు...... నేను తెలుసుకోవాలి



భగవాన్!
నీవు నాలో ఉన్నావని
నా చుట్టూ ఉన్నావని
నా వెనుక ఉన్నావని
నా ముందు ఉన్నావని
నన్ను తెలుసుకొంటూ ఉన్నావని
నాకు తెలుసు.

కాని,
నన్ను సుఖపెట్టమని
నాకు ఆనందాన్ని పంచమని
అన్యుల వైపు చూస్తున్నానంటే
నాకు ఏమి తెలిసినట్లు? ఏమీ లేదు.
అందుకే నేను తెలుసుకోవాలి.



భగవాన్!
దర్శింప దగిన వాడివి నీవేనని
అర్చింపదగిన వాడివి నీవేనని
స్తుతింపదగిన వాడివి నీవేనని
ధ్యానింపదగిన వాడివి నీవేనని
నాకు తెలుసు.


కాని,
నీకు అతి సమీపంగా నేను చేరిపోవాలని
నీవుగా నేను మారిపోవాలని
అహరహం అభిలషించే నేను



నిన్ను దృశ్యంగా దర్శించాలని
దర్శించి తరించాలని భావిస్తున్నానంటే
నాకేమి తెలిసినట్లు?
అందుకే నేను తెలుసుకోవాలి.


భగవాన్!
అంతట ఉన్నది నీవేనని
అన్నిటిలో ఉన్నది నీవేనని
అందరిలో ఉన్నది నీవేనని
ఎప్పుడూ ఉన్నది నీవేనని
నాకు తెలుసు.

కాని,
అవి కావాలి - ఇవి పోవాలి
అవి రాకూడదు - ఇవి పోకూడదు
అంటున్నానంటే నాకేమి తెలిసినట్లు?
అందుకే నేను తెలుసుకోవాలి.



భగవాన్!
బరువులు బాధించినా
బాధలు పీడించినా
ప్రారబ్దం పిండుతున్నా
హృదయం ఎండుతున్నా
నీ వీక్షణం ఒక్క క్షణం నాపై పడితే
మరుక్షణం అవన్నీ ఆవిరై పోతాయని
నాకు తెలుసు.

కాని,
క్షణంలో అంతరించే అవకాశం ఉన్నా
అవగాహన కొరవై జన్మలు దొర్లించుకుంటున్నాను.
నాకు ఏమి తెలిసిందని?
అందుకే నేను తెలుసుకోవాలి.




భగవాన్!
నీ శక్తి అపారమని
నీ యుక్తి అనంతమని
నీ దక్షత అద్భుతమని
నీ పాలన అసమానమని
నాకు తెలుసు.

నాకు శక్తి నివ్వమని
యుక్తిని అనుగ్రహించమని
నిన్ను ప్రార్థిస్తున్నా.

నీవు ఇచ్చే శక్తిని పుచ్చుకొని
నీవు ఉన్నావనే ధైర్యం తెచ్చుకొని
నేనే ఏదేదో చెయ్యాలని భావిస్తున్నానని
నాకు తెలుసు.

కాని,
నీ శక్తి ముందు నేను నిరుపయోగమని
నీ యుక్తి ముందు నేను నిష్ప్రయోజనమనే
వాస్తవాన్ని గ్రహించి
మనస్సును నిగ్రహించి



చేతులు దులుపుకొని
చిత్తాన్ని నిలుపుకొని
హృదయాన్ని నీ అడుగుల కడ పడేస్తే
నన్ను మించిన శక్తిపరులు ఎవరుంటారు?
ఇది నాకు తెలిసిందా?
అందుకే నేను తెలుసుకోవాలి.

నిన్ను నాకు ఇచ్చుకొనేందుకు
నేనుగా నీవు వెలిగేందుకు
నీవు నిరీక్షిస్తున్నావని
నాకు నేనుగా తెలుసుకోవాలి.

నీ పాదాలపై వాలి
నన్ను నేను తెలుసుకోవాలి.

ఓం. . ఓం. . ఓం . .

ఓం స్వామి సుందర చైతన్యానంద

అద్దంలో అందం

శ్రీమతి సి.పద్మ

ఈ ప్రపంచంలో అందరూ కళాకారులు కారు. కానీ, కొద్దో, గొప్పో అందరూ కళా హృదయాన్ని కలిగి ఉంటారు. 'ఎంత కమ్మటి కవిత వ్రాశావు!', 'ఎంత చక్కటి బొమ్మ గీశావు!' అని కళాకారులను ప్రశంసిస్తూ ఉంటారు. కళాకారులు అందించేది వారి మనసు సృష్టించిన దానినే. ఎవరి సృష్టి వారికి ప్రియం. తనకు ప్రియమైన దానినే కళాకారుడు వ్యక్తం చేస్తూ ఉంటాడు.

ప్రేమ పిపాస, సౌందర్యోపాసన అనేవి ఎక్కువ శాతం అందరూ ఇష్టపడేవి. కానీ, అన్ని వేళలా ప్రేమను, అందాన్ని వ్యక్తం చేయడం మనసుకు సాధ్యపడదు. ఒక్కొక్కప్పుడు ద్వేషాన్ని, వికారాల్ని కూడా వ్యక్తం చేస్తూ ఉంటుంది. ఎందుకని? వాటిని తనలో ఉంచుకోలేదు కనుక.

నవ్వు పెదవుల పైనే నాట్య మాడుతుంటుంది. కన్నీళ్ళే, నిలువలేక కారిపోతాయి. నవ్వును విడవటం మనిషికి సాధ్యం కాదు. కారణం, ఆనందం మనిషి స్వరూపం. కన్నీళ్ళను ఉంచుకోవడం మనిషికి ఇష్టం లేదు. కారణం, దుఃఖం మనిషి స్వభావం కాదు.

మరి ఇష్టం లేనివాటిని, తనలో దాచుకోలేని వాటిని మనసు ఎందుకు సృష్టించుకుంటుంది? తన చుట్టూ అవే ఉన్నాయి కనుక. నిద్ర లేచింది మొదలు మనిషి వీటిని ఎదుర్కోక తప్పడం లేదు కనుక.


మనుష్యుల వింత ప్రవర్తన, పరిస్థితుల ఒత్తిడి, పరిసరాల ప్రభావం వల్ల వికారాలు తమలోనూ తొంగి చూడటం సహజం అని కొందరి వాదన.

చుట్టూ ఉన్నది నీళ్ళే కదా అని పడవ లోనూ నీళ్ళు నింపుకుంటే ఏమవుతుంది?

పడవను ముంచేది నది లోని నీళ్ళు కాదు, తన లోని నీళ్ళు. మనస్సును అశాంతికి గురి చేసేది బాహ్య పరిస్థితులు కావు, తన లోని ప్రతిచర్యలే.

మరి పరిస్థితులు పెనుతుఫాను లాగా చుట్టు ముడితే నావ సముద్రంలో మునిగినట్లు మనస్సు దుఃఖ సాగరంలో మునిగిపోదా? నిజమే. కానీ, ఈత నేర్చిన వాడు నావ మునిగినా ఈదుకొని తీరాన్ని చేరినట్లు, భక్తి ఉన్నవాడు దుర్భర పరిస్థితులలో కూడా అశాంతిలో మునగక ప్రశాంతంగా జీవించ గలడు.

మనస్సు గాజు భవనం లాంటిది. మనిషికి పంచేంద్రియాల ద్వారా అది బాహ్య ప్రపంచాన్నే చూపుతూ ఉంటుంది. ప్రపంచం స్ఫురించినంత వరకు మనిషిలో రాగద్వేషాలు చెలరేగక తప్పవు. అంతేకాదు, గాజుభవనం లోని వస్తువులన్నీ బయటకు ప్రస్ఫుటంగా కనిపించినట్లు, మనసులో నిక్షిప్తమై ఉన్న రాగద్వేషాలు ఏదో ఒక సమయంలో బాహ్యానికి వ్యక్తమవక మానవు.



గాజు లాంటి మనస్సు అద్దంగా మారాలి.

ప్రపంచాన్ని చూపే గాజుభవనం అద్దాలమందిరం కావాలి.

అద్దాలమందిరంలో ఎటు చూచినా కనిపించేది చూచే వాళ్ళే.

భక్తి అనే పూతతో గాజు లాంటి మనస్సు అద్దంగా మారి, బాహ్య జగత్తుకు బదులు మన స్వరూపాన్ని మనకు చూపుతుంది.

రూప దర్శనంలో వికారాలు తొంగి చూడవు.

స్వరూప దర్శనంలో అశాంతి పొడసూపదు.

అంతర్ముఖమైన మనస్సులో కనిపించేది మనస్సే కనుక అద్దంలో చూసుకొనే వారు అప్రయత్నంగా రూపాన్ని సరిదిద్దుకున్నట్లు, తనను తాను అవలోకించుకునే మనస్సు తెలియకుండానే తనను తాను సంస్కరించుకుంటుంది.

రోజు రోజుకూ ప్రసన్నంగా, ప్రమోదంగా మారుతుంది.

ప్రసన్నత, ప్రమోదము నిండిన మనస్సు వాటినే ప్రపంచానికి పంచుతుంది.

ప్రేమ లేనివారు కృష్ణభక్తులు కాలేరు.

అధర్మపరులు రామభక్తులు కాలేరు.

ఆధ్యాత్మిక దృక్పథం లేనివారు గురుభక్తులు కాలేరు.

ప్రేమ, ధర్మము, ఆధ్యాత్మికత అనేవి జ్ఞాన లక్షణాలు. ఈ దైవీ సంపదను మనసులో నింపుకున్న వారు భగవత్స్వరూపులై శోభిస్తారు.

నీటి వల్ల పుట్టిన నాచు నీటినే మూసినట్లు, నిప్పు వల్ల ఏర్పడిన నివురు నిప్పునే కప్పినట్లు, జీవత్వంలో ఎగిసిపడే రాగద్వేషాలు జీవుణ్ణి భ్రాంతి నుండి బయటపడకుండా చేస్తాయి. నాచు తొలగిన నీరు పానయోగ్య మైనట్లు, నివురు తొలగిన నిప్పు కాంతివంత మైనట్లు, రాగద్వేషాలు తొలగితే జీవుడు ప్రసన్నతను పొందుతాడు.

దీపం వల్ల కరిగిన నేతి గడ్డతో దీపం దేదీప్యమానమై వెలిగినట్లు, జ్ఞానం చేత జ్వలించిన తేజస్సుతో మనస్సు దీప్తిమంత మవుతుంది.

ఋణ విముక్తులు కావడానికి ఇంటిలోని ఒక్కొక్క వస్తువునే అమ్ముతూ చివరగా ప్రియమైన బంగారాన్ని కూడా అమ్ముకుంటారు.

మనస్సు నుండి ఎన్ని బంధాలను తొలగించుకున్నా సరే, ఒక్క బంధం మిగిలి ఉన్నా అది బంగారు సంకెలగా మారి ముక్తికి ప్రతిబంధకం అవుతుంది.


ఏ ఎండకు ఆ గొడుగు పట్టే ప్రపంచ మిది. నేడు ఆదరించిన ప్రపంచం రేపు చీదరించుకున్నా, పరమేశ్వరుని అండ చేరగలిగితే, బ్రతుకు దండిగా పండుతుంది. పండువెన్నెల గుండెలో నిండుతుంది.

జగద్గురు జీవితము

ధారావాహిని-2

స్వామి సుందర చైతన్యానంద

పూలన్నీ వికసిస్తాయి. వికసిత పుష్పాలలో సౌరభాన్ని విరజిమ్మే కుసుమాలు ఎన్ని? పరిమళ పుష్పాలే పరమేశ్వరునికి ప్రీతికర మైనవి.



వైశాఖ శుక్ల పంచమి

వైశాఖ శుక్ల పంచమి నాడు ఆర్యాంబ ముద్దు లొలుకు మోహనరూపుని ప్రసవించింది. ఆ బాలుడికి శంకరుడని పేరు పెట్టారు. *'శం కరోతీతి శంకరః'* సుఖాన్ని ప్రసాదించువాడు శంకరుడని భావం.

లౌకిక విషయాలు దుఃఖ మిశ్రితాలు. పారమార్థికాలు సుఖరూపాలు. దుఃఖరహిత సుఖ స్వరూపాలు. అట్టి దివ్యమైన, భవ్యమైన సుఖాలను ప్రసాదించువాడు కనుక ఆ దివ్యాత్ముని శంకరుడని పిలిచారు.

అంతేకాదు, ఆ మహాత్ముడి జనన కాలం లోని తిథి పక్ష మాసాలను పరిశీలిస్తే ఆ మహితాత్ముని నామవైభవం సుస్పష్ట మవుతుంది.

వైశాఖ శుక్ల పంచమి నాడు స్వామి ఉదయించాడు. దీనిని తిప్పి పఠిస్తే పంచమి - శుక్ల - వైశాఖ వస్తుంది.

పంచమి తిథి ఐదవది కాగా, శుక్ల పక్షం మొదటిది కాగా, వైశాఖ మాసం రెండవ నెల.

'శం' అనే అక్షరం 'ఐదు' అంకెకు సంకేతం. 'క' అనే అక్షరం 'ఒకటి' అనే అంకెకు పర్యాయం. 'ర' అనే అక్షరం 'రెండు' అంకెకు సంకేతం.

ఈ విధంగా స్వామి జన్మించిన తిథి మాసాలను అనుసరించి చూసినా వారు జ్ఞానం ద్వారా ప్రపంచానికి నిత్య సుఖం ప్రసాదించే వారే అని స్పష్ట మవుతున్నది.

పువ్వు పుట్టగానే పరిమళించినట్లు, శ్రీ శంకరులు మూడవ ఏటనే చదవడం, వ్రాయడం నేర్చారు. ఐదవ సంవత్సరం వచ్చేసరికి సంస్కృత భాషలో వైదుష్యం సంపాదించారు. పుత్రునికి ఉపనయన సంస్కారం జరిపించాలని తండ్రి సంకల్పించాడు. ముచ్చటపడ్డాడు. విధి బలీయ మైనది. ఆ కోరిక ఫలించకుండానే ఆయన పరమపదించాడు. బంధువుల సహకారంతో ఆర్యాంబ కుమారునికి ఉపనయన సంస్కారం జరిపించి, విద్యను

ఆర్జించడానికి గురుకులానికి పంపించింది. మూడు సంవత్సరాల కాలంలో శ్రీ శంకరులు సమస్త విద్యలను అభ్యసించి సర్వశాస్త్ర కోవిదు డయ్యాడు. వారి వైదుష్యమును చూసి గొప్ప విద్వాంసులు సైతం విస్మయం చెందేవారు.

ఆ రోజులలో పూర్ణానది కాలడికి దూరంగా ప్రవహిస్తూ ఉండేది. దూరమైనా ఆర్యాంబ నిత్యం పూర్ణానదికి వెళ్ళి స్నానం ఆచరించి వచ్చేది. ఒకనాడు సూర్యుని వేడిమి తీవ్రంగా ఉంది. స్నానానికి నది వద్దకు వెళ్ళిన మాతృమూర్తి తిరిగి ఇంటికి రాలేదు. శ్రీశంకరులు తల్లికై అన్వేషిస్తూ నది వైపు నడువ సాగారు. మార్గమధ్యంలో ఒక చెట్టు నీడలో తల్లి స్పృహ తప్పి పడి ఉంది. తల్లికి సేవలు చేసి ఇంటికి తీసుకొని వచ్చారు. ఇక మీదట తన తల్లికి ఈ విధమైన బాధ కలుగ కూడదని శంకరులు సంకల్పించారు. మహా పురుషుల సంకల్పం ముందు మహా ప్రళయాలు కూడా తలవంచక తప్పదు కదా! ఇక స్వల్పమైన, అల్పమైన నది ఏపాటిది? శంకరులు సంకల్పించారు. ఆయన అభీష్టానుసారం నది తన ప్రవాహాన్ని విపరీతమైన రీతిలో మరలించుకొని ఆచార్యుల గృహ సమీపంలో ప్రవహించ సాగింది. ఆనాటి నుండి తన తల్లి శ్రమపడకుండానే స్నానం ఆచరించ గలగడం చూసి శంకరులు ఆనందభరితు లయ్యారు. భవిష్యత్తులో జీవన గతులను మార్చే మహాత్ముడికి ఈ నదిని మరలించడం అసాధ్యమా?

తల్లిదండ్రులను సుఖపెట్టడానికి సదా తపించేవాడు తనయుడు. విద్యామదంతో, సంసార మోహంతో, సంపాదనా వ్యామోహంతో తల్లిదండ్రులను విస్మరించి చరించే మేధావులు ఎంత ఆర్జించినా తృప్తి చెందక, సంపాదన కొరకు పరదేశాలకు వెళ్ళి తల్లిదండ్రుల అంత్యక్రియలకు కూడా హాజరు కాని ప్రబుద్ధులు శ్రీ శంకరుల మాతృ సేవను ఆదర్శంగా తీసుకుని తమ జీవన విధానాన్ని మార్చుకోవాలి. వ్యామోహాలకు గురై, జన్మ నిచ్చిన తల్లిదండ్రులను విస్మరించి చరించే జడులున్న సమాజం జంతువులు చరించే అరణ్యమే గాని సభ్యసమాజం కాబోదు.

ఇంట గెలిచి రచ్చ గెలవాలి. ఇంటిని బాగు చేయలేనివాడు సమాజాన్ని ఉద్ధరించేందుకు మేలు కొలుపులు పాడితే అది శ్మశాన సంగీతమే అవుతుంది. సమాజోద్ధరణ పేరుతో వారు గంటలు మ్రోగిస్తూ వంతలు పాడినా చివరికి మిగిలేవి మంటలే.

శంకరుల వంటి జ్ఞాన సంపన్నులు ప్రథమంగా కుటుంబాలను చక్క దిద్దారు. సేవ చేశారు. ఆ తరువాత సమాజంలో అభ్యుదయాన్ని సాధించారు. అందుచేత వారు అడుగిడిన చోటల్లా మడుగులు అదృశ్య మయ్యాయి. మంటలు ఆరిపోయాయి. శాంతి పంటలు తయారయ్యాయి. సమాజాన్ని కళ్యాణప్రదం చేశాయి.

తల్లికి ఎనలేని సేవలు అందించిన శ్రీ శంకరులు సమాజం లోని తల్లులకు కూడా అసమాన సేవ లందించారు.

గురుకుల వాసం చేసే రోజులలో ఒకనాడు శ్రీ శంకరులు భిక్ష గ్రహించడానికి ఒక ఇంటికి వెళ్ళారు. అది నిరుపేదరాలి గృహం. ఆమె మహా సాధ్వి. పరమ భక్తురాలు. బ్రహ్మ వర్చస్సు ఉట్టిపడుతున్న బాల బ్రహ్మచారి అయిన శ్రీ శంకరులను దర్శించి, సాక్షాత్తు

పరమశివుడే తన ఇంటి ముందు నిలబడి ఉన్నట్లు భావించింది.

శంకరులకు భిక్ష వేస్తే తన జన్మకు సార్థకత లభిస్తుందని భావించింది. ఇల్లంతా అన్వేషించింది. అంతా శూన్యమే. భిక్ష వేయడానికి ఏమీ లభించలేదు. ఆమె నేత్రాలలో మేఘాలు నిలిచాయి. తన దారిద్ర్యానికి తానెప్పుడూ వ్యథ చెందలేదు. ఒక మహాత్మునికి భిక్ష వేయలేని తన దురదృష్ట హస్తాలను చూసుకుంటూ విలపించ సాగింది.

మళ్ళీ మళ్ళీ గృహంలో వెదక సాగింది. ఒక ఎండిన ఉసిరిక తప్ప మరేమీ కనిపించ లేదు. ఇదెలా సమర్పించాలి? ఇంతకన్నా మరొక మార్గం లేదు. పొంగి వస్తున్న కన్నీటిని ఆపుకొంటూ ఆ ఉసిరికను తెచ్చి అక్షయ పాత్రలో వేసి స్వామికి నమస్కరించింది.

ఆమె భక్తికి శంకరుల హృదయం ద్రవించింది. ఆమె దారిద్ర్యాన్ని దూరం చేయాలని శంకరులు భావించారు. వెంటనే శ్రీమన్మహాలక్ష్మిని ప్రార్థించారు. ఆచార్యుల ప్రార్థన ఆలకించిన శ్రీదేవి వెంటనే పేదరాలి గృహంలో స్వర్ణ ఉసిరికలను కురిపించింది. ఈ సందర్భంలో శంకరులు గానం చేసిన స్తోత్రమే కనకధారాస్తవం. ఐశ్వర్య ప్రదాత, మంగళకరుడు అయిన శ్రీ శంకరులను ఆశ్రయించిన వారికి దారిద్ర్య దుఃఖాలు ఉండడానికి వీలు లేదు.

సంపత్కరాణి సకలేంద్రియ నందనాని
సామ్రాజ్య దాన విభవాని సరోరుహాక్షి
త్వద్వంద్వనాని దురితోద్ధరణోద్యతాని
మామేవ మాత రనిశం కలయన్తు మాన్యే ॥

అమ్మా! కమల దళాయతాక్షీ! మాన్యవైన నీకు మ్రొక్కిన వారికి సర్వ సంపదలు సమకూరుతాయి! ఇంద్రియాలకు సంతసం చేకూరుతుంది. నీవు సామ్రాజ్య వైభవాన్ని కూడా ప్రసాదించ గలవు. తల్లీ! నా పాపాలను పోగొట్టి నన్ను ఉద్ధరించు. సదా నిన్ను స్మరించేలా ఆశీర్వదించు. నీకు నమస్కరించేలా అనుగ్రహించు.

శ్రీ శంకరులు తనకు భాగ్యం ఇవ్వమని ప్రార్థించలేదు. వందన భాగ్యం అనుగ్రహించమని ప్రార్థించారు. భక్తుని వందనం భగవతికి బంధనం. ఈ భాగ్యం పొందిన వారి బ్రతుకే నందనం.

భగవత్కృప పొందడానికి కావలసింది ఆర్తియే కానీ ఆస్తి కాదు. ఆమె నిరుపేద అయినా తన భక్తి అనే సంపదతో శంకరుల హృదయాన్ని పొంద గలిగింది. మంచి చేయడానికి పరితపించే పుణ్యాత్ములు సంచితం నుండి విడివడి తరించ గలరు. మంచి చేయాలనే దృఢ సంకల్పం ఉంటే చాలు. మార్గం మనల్ని వరించి సమీపిస్తుంది. అదే గమ్యం వైపు నడిపిస్తుంది. అకుంఠిత దీక్షతో చరించే మంచి అలవాటును ఆధ్యాత్మిక సాధకులు అలవరచు కోవాలి.

నిజ గురువు నిధిని చూడడు. నీ హృదయాన్ని చూస్తాడు. గురుకృపకు పాత్రులైన

వారు ధన్యు లౌతారు. వారే నిజమైన భాగ్యవంతులు. భావ సంపదతో బంగారు బ్రతుకులను పొంది శోభించే భవ్యాత్ములు. దివ్యాత్ములు.

పరుల బాధలను చూసి తమ బాధలుగా భావించే శ్రీ శంకరులు తమ జీవితాన్ని మానవ కళ్యాణానికే వినియోగించాలని నిర్ణయించుకున్నారు. శ్రీ శంకరులది సమ భావం. వారిది సమదర్శనం. వారికి అందరూ ఒక్కటే. కాని తల్లి అయిన ఆర్యాంబకు శంకరులు ఒక్కరే.

జగత్కల్యాణానికి అంకితమయ్యే శ్రీ శంకరులు జన్మ నిచ్చిన తల్లికి దూరం కాక తప్పదు. ఏకైక పుత్రుడైన శంకరులపై పంచ ప్రాణాలను పెట్టుకొన్న తల్లి తనయుని త్యజించదు. అమ్మ ఆజ్ఞ లేనిదే అడుగు ముందుకు వేయరు ఆచార్యులు. ప్రాణమైనా ఇస్తుంది గాని పుత్రుని మాత్రం వదలదు ఆర్యాంబ. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి?

'అమ్మా! నాకొక కోరిక ఉంది' అని తల్లిని సమీపించారు ఒకనాడు బాలశంకరులు.

'నాయనా! ఏమిటది?' అడిగింది తల్లి ఆర్యాంబ.

'తల్లీ! ఈ లోకం శోకమయం, జీవితం బుద్బుదప్రాయం. క్షణికమైన ఈ జీవితంపై ఆశలు పెంచుకొని జీవిత లక్ష్యం విస్మరించటం అవివేకం. నా మనస్సనే త్రాసును స్థిరంగా ఉంచాను. ఒక సిబ్బిలో ప్రపంచాన్ని ఉంచాను. మరో సిబ్బిలో పరమాత్మను ఉంచాను. ఈ రెండింటిలో అధిక సుఖశాంతులను అందించేది ఏదో పరీక్షించి చూశాను. పరమాత్మే సత్యం, జగత్తు అసత్యం. సత్యరూపుడైన పరమాత్మను అన్వేషించే ప్రయత్నంలో నేను సన్యసించ దలచాను. తల్లీ! నాకు అనుజ్ఞ ఇవ్వు. నా కోర్కె తీర్చు' అని తల్లిని అభ్యర్థించారు బాలశంకరులు.

ఆహా! ముక్కుపచ్చలారని పూపవయస్సులో వివేక వైరాగ్యాలు శంకరుల మస్తిష్కాన్ని గాఢంగా పెనవేసుకున్నాయి. తనయుడి పలుకులను ఆలకించి తల్లి తల్లడిల్లి పోయింది.

'నాయనా! నా జీవితానికి నీవే ఆశాజ్యోతివి. నా బ్రతుకుబాటలో నీవే దారి దీపానివి. నీవు లేని నా జీవితం చుక్కాని లేని నావ వంటిది. నీరు లేని బావి లాంటిది. నన్ను ఏకాకిని చేసి నీవు ఏకాంతం అనుభవించడం నేను భరించలేను. నీవు సన్యసించడానికి నేను అంగీకరించను' అన్నది మాతృమూర్తి.

శ్రీ శంకరులు ఆదర్శ పుత్ర రత్నం. తల్లి ఆజ్ఞ లేనిదే అతడు సన్యాసం స్వీకరించడు. తన తల్లి అంగీకరించే రోజు వస్తుందని శంకరుల ప్రగాఢ విశ్వాసం.

ఒకనాడు శ్రీ శంకరులు స్నానం ఆచరించడానికి తల్లితో పాటు నదికి వెళ్ళారు. నీటిలో దిగారు. ఒక మునక వేశారు. ఈ లోగా మొసలి ఒకటి శంకరుల పాదం పట్టుకుంది. భవిష్యత్తులో కోట్ల కొలది జనులు ఆశ్రయించే పవిత్ర పాదాలను ప్రథమంగా స్పృశించే భాగ్యం మకరికి దక్కింది. శంకరులు బిగ్గరగా రోదించారు. రక్షింపుమని తల్లిని ప్రార్థించారు. గట్టుపై ఉన్న తల్లికి తక్షణ కర్తవ్యం తెలిసి రాలేదు. అశక్తురాలై విలపించ సాగింది.

'అమ్మా! నా జీవితం సమాప్త మవుతున్నది. నేను మృత్యుముఖంలో ప్రవేశించి ఉన్నాను. నాకు మిగిలి ఉన్నవి క్షణాలే. తల్లీ! అంత్యకాలంలో కూడా నా ఆశ ఫలించదా? చివరి క్షణంలో నైనా నా కోర్కె తీరదా? సన్యాసం స్వీకరించాలని ఆశించాను. నిరాశే ఎదురైంది. మృత్యువు సమీపిస్తున్నది. కనీసం ఆపత్ సన్యాసం గ్రహించడానికి అనుమతించు. ఆ తృప్తితోనైనా కన్ను మూసే అదృష్టం కల్పించు' అని శంకరులు తల్లిని ప్రార్థించారు.

ఆర్యాంబకు అంతా అయోమయంగా ఉంది. అగమ్యగోచరంగా ఉంది. బిడ్డను తృప్తిపరచడానికి అనాలోచితంగా 'సరే' అన్నది.

సన్యస్తోహం - 'నేను సన్యసించాను' అని మూడుసార్లు పలికారు శ్రీ శంకరులు. మొసలి శ్రీ శంకరుల పాదం వదలింది. నిజమే కదూ! భవిష్యత్తులో నాస్తికులనే మొసళ్ళ నుండి దేశాన్ని రక్షించనున్న ఆచార్యులకు తనను పట్టుకొన్న మకరిని విడిపించుకోవడం కష్టతరమా?

శంకరులు తల్లిని సమీపించారు. కౌగిలించుకున్నారు. గట్టుపై ఉన్న మాతృమూర్తికి నీళ్ళలో జరిగిన గుట్టు అర్థం కాలేదు. తనయుడు తనవా డయ్యాడని మురిసి పోయింది.

'నాయనా! నా బంగారు తండ్రీ! నా వజ్రాల మూట! పరమశివుడు కరుణించాడు. నా తండ్రి నాకు దక్కాడు. తండ్రీ! చాలా ఆలస్యమైంది. ఇంటికి పోదాం పద!' అన్నది ఆర్యాంబ.

'అమ్మా! ఇక అన్ని ఇళ్ళు నావే. నేను ఒక ఇంటికి సంబంధించిన వాడిని కాను. ఇక ముందు నాకు భిక్ష ఇచ్చే వారందరూ నా తల్లులే. బోధ చేసేవాడే నాకు తండ్రి. నా వద్ద విద్యను ఆర్జించే వారందరు నా బిడ్డలు. ఇలా నా కుటుంబం విస్తరిస్తుంది. ఇదంతా నీ కరుణే. నీ అనుమతి తోనే ఈ మహత్కార్యం ఆవిష్కరింప బడింది. తల్లీ! క్షమించు. నీ అంగీకారం తోనే నేను సన్యాసం స్వీకరించాను. సన్యాసికి ఇల్లెక్కడ? తల్లెవరు? అమ్మా! జన్మ ఇచ్చిన జననివి. బాధపడకు. నీవు కోరినపుడు నేను నీ ప్రక్కన ఉంటాను. అంత్యకాలంలో నేను నీ సమీపంలో ఉండ గలనని ప్రతిజ్ఞ చేస్తున్నాను' అని పలికి, తల్లికి నమస్కరించి బయలుదేరారు శ్రీ శంకరులు. విశ్వనాథుని పొందడానికి విశ్వంలో కాలుమోపారు. కాలడికి దూరమయ్యారు. తనయుడికి అన్వేషణే మార్గమయింది. తల్లికి ఆవేదనే గమ్యమయింది.

ఈ సంఘటన లోని ఆధ్యాత్మిక అవగాహనను గ్రహించటం ముముక్షువుల కర్తవ్యం. జననమరణ రూప సంసారమే నదీ ప్రవాహం. సంసారం అనే నదిలో దిగిన వారిని మాయ అనే మొసలి పట్టుకుంటుంది. మాయా మకరి నుండి బయట పడటానికి సన్యాసమే సరైన మార్గం. సన్యాస మనగా త్యాగమని అర్థం. మనస్సు లోని కల్పిత భావాలను త్యజించటమే త్యాగం. ఇదే నిజమైన సన్యాసం.

'నేను సన్యసించాను' అని శంకరులు చెప్పగానే మకరి ఆయన పాదం వదలి పెట్టింది.

ఎవరైతే మనస్సు లోని అజ్ఞానాన్ని త్యాగం చేస్తారో వారిని మాయా మకరి వదలి పెడుతుంది. మాయ నుండి విడిపడిన వారు మాధవులే అవుతారు.

పంజర కుడ్యాన్ని ఛేదించుకొని పక్షి బయట పడినట్లు, సంసార జీవన పంజరం నుండి బయటపడి అన్వేషణ ఆరంభించారు శ్రీ శంకరులు. రెండు రెక్కలతో పక్షి గగనంలో విహరించినట్లు వివేక వైరాగ్యాలనే రెక్కలను తగిలించుకొని శ్రీ శంకరులు పయనించ సాగారు.

ఏకమైన సత్యాన్ని దర్శించడానికి ఏకాకిగా బయలు దేరారు. తోడు లేని, కీడు తెలియని ప్రయాణమది. వికృత మెరుగని ప్రకృతి సౌందర్యంలో తన లక్ష్యానికి ఆకృతి ఇచ్చే ప్రయత్నం అది. ఉన్నది ఊడిపోగా, తానన్నది వీడిపోగా అరిషడ్వర్గాలపై దాడి చేస్తూ, వాడిన మమకారమును వీక్షిస్తూ, మాడిన అహంకారాన్ని సమీక్షిస్తూ, వడివడిగా అడుగులు వేసుకుంటూ ఆనంద ధామాన్ని చేరడానికి ఉద్యమిస్తున్న ప్రస్థానమది.

ఉత్తముడైన గురుదేవుని పొంది ఉత్తీర్ణు డయ్యేందుకు ఉత్తర దిక్కుగా బయలు దేరారు శ్రీ శంకరులు. బాహ్యంలో ఏకాంతం అనుభవిస్తూ, ఆంతర్యంలో ఏకత్వం అభిలషిస్తూ, మోక్షమార్గంలో, అవిశ్రాంత బాటసారిగా చరిస్తున్నారు యెనిమిదేళ్ళ బాల శంకరులు. వయస్సు పెద్దది కాదు. కానీ ఆ మహితాత్ముని మనస్సుకి ఈ ప్రపంచం చాలా చిన్నదై పోయింది. ఆయన వైరాగ్యం ముందు చిన్నబోయింది.

ఉదయ సాయంత్రాలలో నదీ తీరాలలో కూర్చుని జపధ్యానాదులు ఆచరించేవారు శ్రీ శంకరులు. మధ్యాహ్న కాలంలో ఏదో ఒక ఇంటి నుండి భిక్ష గ్రహించే వారు. అందిన దానిని ఆరగించడమే గాని అందించిన వారెవరని చూసే అలవాటు వారికి ఉండేది కాదు. వృక్ష ఛాయలో విశ్రమించేవారు. ఆలయాలలో గాని, ధర్మశాలలో గాని రాత్రిపూట నిద్రించే వారు. తనకంటూ ఏదీ ఉండేది కాదు, నిత్య తృప్తి తప్ప. ఎంతో ఆనందంతో, ఉత్సాహంతో పగలంతా పయనించేవారు శ్రీ శంకరులు.

నదులను దాటుతూ, గ్రామాలను చేరుతూ ఒక్క రాత్రి కన్నా ఎక్కువగా ఒక చోట నిలవక ప్రయాణం సాగిస్తూ, ఒకనాడు అరణ్య మధ్యంలో ఉన్న ఒక విశాల మైదానంలో కాలు పెట్టారు శ్రీ శంకరులు.

అది మధ్యాహ్న సమయం. భగ్గు మంటున్న మండుటెండ. ప్రయాణం కష్టసాధ్యంగా ఉంది. కొంతసేపు విశ్రమించాలని ఒక చెట్టు క్రింద ఆసీను లయ్యారు శ్రీ శంకరులు. ఆయన దగ్గరగా ఒక చెలమ ఉంది. ఆ చెలమ గట్టుపై ఉన్న బండ క్రింద రెండు కప్పలు విశ్రమించి ఉన్నాయి. ఎండ వేడికి ఆ కప్పలు అక్కడ నిలవ లేక చెలమలో ప్రవేశించి చల్లదనం అనుభవించా లనుకున్నాయి. కాని బడబాగ్నిలా దహించి వేస్తున్న ఆ ఎండలో ఎగిరే సామర్థ్యం కూడా కోల్పోయి శోషింప సాగాయి.

ఇంతలో ఒక పెద్ద త్రాచు పాము వాటిని సమీపించింది. పడగ విప్పింది. శోషించిన మండూకాలపై గొడుగు వలె పడగ ఉంచింది. కొంతసేపు పడగ నీడన విశ్రాంతి అనుభవించిన కప్పలు తేరుకొని నీటిలో ప్రవేశించాయి. పాము వెనుదిరిగి వెళ్ళింది.

శంకరుల భావ ప్రవాహం వేగాన్ని పుంజుకున్నది. పరస్పర వైరుధ్యం గల సర్ప మండూకాలు వైషమ్యాలను మరచి వైదుష్యంతో, ప్రేమతో వ్యవహరించటమా? ఈ వైభవానికి కారణం ఏదై ఉంటుంది? ఇదేదో పుణ్య స్థలమై ఉండాలి. ఈ ప్రత్యేకతలు, పవిత్రతలు ఈ ప్రదేశాని కెలా కలిగాయి? శంకరుల ఆలోచనలు శరవేగంతో నడుస్తున్నాయి.

ఆ ప్రదేశానికి సమీపంలో ఒక ఆశ్రమం కనిపించింది. శంకరులు ఆ ఆశ్రమం చేరి, ఆశ్రమవాసి అయిన సన్యాసిని ప్రశ్నించారు. స్థల పురాణం ఆలకించటానికి కుతూహలం కనబరిచారు. ఈ పవిత్ర ప్రదేశం గతంలో ఋష్యశృంగ మహర్షి తప మాచరించిన పుణ్యస్థలి అని, ఆ ప్రదేశంలో వారి ఆశ్రమం కూడా ఉండేదని సాధువు శంకరులతో చెప్పారు.

మహాతపస్వి అయిన ఋష్యశృంగుడు చరించిన భూమి ప్రేమ రంగమై వెలసింది. వైమనస్యాలను తొలగించింది. ద్వేషాన్ని దగ్ధం చేసింది. అసూయను అదృశ్యం చేసింది.

అందుచేతనే మహాత్ములను తీర్థరూపులుగా వర్ణిస్తారు. సామాన్యమైన ప్రదేశాలను పుణ్యక్షేత్రాలుగా మార్చేవారు మహాత్ములు. సాధారణ జలాలను తీర్థ స్వరూపాలుగా మార్చేవారు యతి పురుషులు. కనుకనే **లభ్యతేపి తత్కృప యైవ** భగవత్కృప కలిగితే గాని మహాత్ముల సందర్శన భాగ్యం కలుగదని నారద మహర్షి ప్రవచించారు. వాస్తవానికి మహాత్ముల సన్నిధే మాధవ సన్నిధి. ముముక్షువులకు పెన్నిధి.

శంకరుల మనోగగనంలో తళుక్కున ఒక సంకల్పం మెరుపులా మెరిసింది. భవిష్యత్తులో తాను మఠం నిర్మించాలనుకుంటే ఈ ఆదర్శ పుణ్యస్థలి లోనే నిర్మించాలని శ్రీ శంకరులు భావించారు.

మహాత్ముల మనసులలో స్ఫురించిన సంకల్పాలు నిష్ఫలాలు కావు. వారి హృదయ సరోవరంలో వికసించిన భావ కుసుమాలు వాడిపోవు. ఆ తరువాత ఒక దశాబ్దానికి శ్రీ శంకరులు ఆచార్యులై తమ మొదటి మఠాన్ని ఈ ప్రదేశం లోనే నెలకొల్పారు. అదే శృంగేరి మఠం. శారదా పీఠం.

భవిష్యత్తులో జగద్గురువులై అజ్ఞానాంధకారంలో అలమటించే మానవాళి హృదయ క్షేత్రాలలో జ్ఞానజ్యోతులు వెలిగించనున్న శంకర భగవత్పాదులకు గురువెవరు? ఈ సద్గురువును లోకాని కందించిన ఆ దివ్యాత్ముడెవరు? వీరి కలయిక ఎప్పుడు? ఎక్కడ?

(సశేషం)

మంగళ దీపాలు

ధారావాహిని-15

స్వామి సుందర చైతన్యానంద

వనవర్తి - చక్రవర్తి

(చాణక్య రాజనీతి)

శ్లో॥ ఉత్ఖాతాన్ ప్రతిరోపయన్ కుసుమితాం శ్చిన్వన్ లఘూన్ వర్ధయన్
అత్యుచ్చ్యాన్ నమయన్ పృథక్ విదలయన్ విశ్లేషయన్ సంహతాన్ ।
తీక్ష్ణాన్ కణ్టకినో బహిర్ని యమయన్ స్వారోపితాన్ పాలయన్
మాలాకార ఇవ ప్రయోగకుశలో రాజ్యే చిరం తిష్ఠతి ॥

భావము : రాజ్యమును చక్కగా పరిపాలించు రాజు నిపుణుడైన తోటమాలిని సదా మనస్సులో ఉంచుకోవాలి. (1) భూమిపై గుంటలను పూడ్చి వేసి తోటమాలి పొలమును చదును చేయును (2) పూలను కోయును (3) నీరస మొక్కలకు పుష్టిని కలిగించును (4) ఎత్తుగా పెరిగిన కొమ్మలను ఛాయ నిచ్చునట్లు వంచును (5) మరీ ఎత్తుగా పెరిగిన వాటిని ఖండించును (6) కలిసి పోయిన వాటిని విడదీయును (7) ముళ్ళ రెమ్మలను చెరుగును (8) తాను వేసిన బీజములను సదా కాపాడు చుండును.

వ్యాఖ్య

'యథా రాజా తథా ప్రజా' అనెడి వచనము జనావళిలో సదా వినపడుతూనే ఉంటుంది. రాజు గారి వ్యూహము ననుసరించియే ప్రజల ఊహలు నడుస్తుంటాయి. రాజు వర్తనము ననుసరించియే ప్రజలు ప్రవర్తిస్తూ ఉంటారు. అట్టి రాజు ఎలా ప్రవర్తించాలో తెలియజేయు ఈ శ్లోకము చాణక్య రాజనీతి యందున్నది. తోటమాలిని దృష్టిలో ఉంచుకొని రాజ్య పాలనను సాగించమని చాణక్యుడు సలహా ఇస్తున్నాడు.

(1) తోటమాలి క్షేత్రాన్ని సమంగా ఉంచునట్లు రాజు ప్రజల జీవనము నందలి వెలితి అనెడి గుంటలను పూడ్చివేసి, సమజీవనాన్ని సమాజములో ఆవిష్కరించాలి.

(2) తోటమాలి పూలను కోస్తాడు. పరుల కొరకు వినియోగిస్తాడు. రాజు కూడా మనోహరమైన, సౌరభయుతమైన అభివృద్ధి సుమాలను ప్రజలకు అందించాలి.

(3) నీరస మొక్కలకు తోటమాలి పుష్టి నందించునట్లు, పేదవారి జీవితాలలో వెలుగును, తృప్తిని నింపే కార్యక్రమాలను రాజు చేపట్టాలి.

(4) ఎత్తుగా పెరిగిన కొమ్మలను నీడ నిచ్చు లాగున తోటమాలి వంచునట్లు,

ఆకాశానికి ఎదిగిన వ్యక్తులు అన్యులకు ఉపయోగపడునట్లు వారి జీవన రీతిని రాజు దారి మళ్ళించాలి.

(5) మరీ ఏత్తుకు వికారంగా పెరిగిన కొమ్మలను తోటమాలి ఖండించునట్లు సమాజంలో వికటించి వికృతముగా విస్తరించిన అసుర కృత్యాలను రాజు ఖండించాలి.

(6) కలిసిపోయిన రెమ్మలు నీరసించడమే గాక వృక్ష శోభను పాడు చేస్తాయి. అందుచేత తోటమాలి ఆ రెమ్మలను విడదీస్తాడు. అలాగే, ఒకటైన సంఘ విద్రోహ చర్యలను రాజు వేరు చేయగలిగి ఉండాలి.

(7) పూల మొక్కలను తోటమాలి కత్తిరించి వనానికి సౌందర్యాన్ని ఇచ్చునట్లు, సమాజ రూపు రేఖలను అందంగా తీర్చి దిద్దే ప్రయత్నం రాజు చేస్తూ ఉండాలి.

(8) తోటమాలి ఉన్న చెట్లను కాపాడటమే గాక, తాను వేసిన నూతన బీజాలను సంరక్షించి పోషించునట్లు, రాజు తన రాజ్యంలో ప్రస్తుతం అమలు జరుగుతున్న పథకాలనే గాక, తాను చేపట్టిన నూతన పథకాలను కూడా అమలు పరచగలిగి ఉండాలి.

సుందర చైతన్య ధర్మమూర్తి


శ్రీమతి వి.ఎస్.సౌభాగ్యలక్ష్మి, ఎమ్.ఎ., బి.ఇడి.,

అవలీలగా నీవు శివలీల లెల్లను
తేట తేనియ లొల్క తెలియజేసి
అజ్ఞాన తిమిరాన్ని యంత మొందగ జేయ
విజ్ఞాన దివ్వెలు విస్తరింప
ఉపదేశ వాక్యాలు యుపమాన కథలతో
హాస్య మొప్పెడు రీతి యందజేసి
దీటైన మాటల సూటిగ తప్పులన్
యెంచి చూపుట లోన యెంత నేర్పో!
భక్తిమార్గమ్ము చూపెడి పరమపురుష
భవదనుగ్రహ భాగ్యమ్ము పారనిమ్ము
ప్రభో! దైవాంశ సంజాత వినుత నిజము
దత్త! సుందర చైతన్య ధర్మమూర్తి!

స్వామి సన్నిధిలో ఒక సాయంకాలం

(ఆశ్రమవాసులను, ఆశ్రమ భక్తులను ఉద్దేశించి పూజ్య స్వామీజీ చేసిన ప్రసంగ సారాంశం)

ఆత్మబంధువులారా!



ఎంత కాలంగా ఈ ప్రపంచం ఉందో, ఇక ఎంత కాలం ఉండబోతుందో ఎవ్వరూ చెప్పలేరు. కాని, ఈ ప్రపంచంలో మనం ఉండేది మాత్రం కొంత కాలమే నని ఎవ్వరైనా చెప్పగలరు. ఈ ప్రపంచంలో మనం ఎంత కాలం ఉంటామో తెలియదు. ఎంత కాలం ఉన్నా, ఏదో ఒకనాడు ఈ జగత్తును విడిచిపెట్టి పోవాలి అనేది మనందరికీ తెలుసు. అలా విడిచి పెట్టిన రోజు మనం ఏమీ లేని వాళ్ళుగా మిగుల్తూ ఉన్నాము.

ఏమీ లేనివాడు బిచ్చగాడు. కాని, అలా బిచ్చగాడి లాగా కూడా మిగలలేక పోతున్నాము. ఎందుకో తెలుసా! బిచ్చగాడికి ఏమీ లేకపోవచ్చు. ఏదీ లేకపోవచ్చు. ఎవరూ లేకపోవచ్చు. కాని వాడైనా మిగిలి ఉన్నాడు. నాకు ఏమీ లేదు అని చెప్పేందుకు బిచ్చగాడు ఉన్నాడు. కాని, పోయేనాడు మన పరిస్థితి వేరే. అన్నీ పోవడము అటు ఉంచి మనం కూడా మిగలకుండా పోతున్నాము.

మన దేహం పంచభూతాలతో తయారైంది. కనుక పాంచభౌతిక మైన ఈ స్థూల ప్రపంచమే మన శరీరానికి అధిపతి. పంచభూతాల నుండి ఉత్పన్నమైంది కనుక ఈ శరీరం తిరిగి పంచభూతాలలో కలసి పోతుంది.

మట్టి మట్టిలో, జలం జలంలో, అగ్ని అగ్నిలో, గాలి గాలిలో కలసి పోతున్నాయి. ఆ తరువాత మిగిలింది ఆకాశమే. ఆకాశం అంతా ఉంది.

ఇక మనకు ఏముంది? ఏమి మిగిలింది? అన్నీ పోయాయి. ఉండిన వన్నీ పోయాయి. ఇలా నేడు పోయినవే ఒకనాడు మనకు ఉండినవి. ఉన్నప్పుడు, అవన్నీ శాశ్వత మని భావించాము. కాదు, భ్రమించాము. మన కెన్నో ఉన్నాయని ఊగిపోతాము. మనకంటూ

ఏవీ లేవని, మన కున్న వన్నీ ఇతరులవి అని ఒకే క్షణాన తేలిపోతుంది. ఆ క్షణమే జీవికి అంతిమ క్షణం.

వచ్చిన దెపుడో తెల్లియదు ఎవరికి
పోయే రోజుందని తెలియని దెవరికి?
దారాసుతులు ధన దాయాదులు
కలిసి రాలేని రోజు అది
మట్టిలో కాయము కలవాలి
తోడొచ్చే దేమిటో తెలియాలి
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

మనవి కాని వాటిని మనవి అనే తప్పుడు ఆలోచనలు అనేక జన్మలలో చేశాము. దాని ఫలితంగా అనంత దుఃఖాన్ని అనుభవిస్తూ వచ్చాము. ఇప్పుడు, ఇటీవల కొన్ని సంవత్సరాలుగా, కొన్ని మాసాలుగా, కొన్ని రోజులుగా సరి దిద్దుకొనే కార్యంలో ఉన్నాము. సరియైన ఆలోచనలు చేస్తూ ఉన్నాం. అదే విచారము. అదే ధ్యానము.

పవిత్రమైన ఈ ఆలోచనలు సాగకుండా, ధ్యానం కొనసాగకుండా ఎన్నో ప్రతిబంధకాలు, అవాంతరాలు అడ్డు తగులు తున్నాయి. అవి ఏవో కావు. (1) గతంలో చేసిన పాపాల జ్ఞాపకాలు (2) వర్తమానంలో ఎదురౌతున్న ప్రతికూల పరిస్థితులు (3) భవిష్యత్తుకు సంబంధించిన భయాలు.

ఇవన్నీ ఉన్నాయి. ఉన్నవాటిని ఉన్నట్లు అంగీకరించాలి. అప్పుడే బ్రతుకులో వెలుగును చూడగలం. వికృతాలు ఎన్నున్నా, విడ్డూరాలు ఎన్ని ఎదురైనా, వివేకం ఉంటే అన్నిటిని అధిగమించ వచ్చు.

గుట్టలు దాటి గుంటలు నింపి
జలము నీరధిని చేరదా?
కర్మలు కరిగి మమతలు మరిగి
నా మది నీ దరి చేరదా?
ఎటులనో? ఏగుటేలనో?
ఆ పొరపాటు - ఈ గ్రహపాటు ॥ ఎటులనో ॥

గతాలు - జ్ఞాపకాలు

గతం ఎవరి దైనా బరువు గానే ఉంటుంది. బాధ గానే ఉంటుంది. గతంలో సుఖాలు లేవని కాదు. సుఖాలు ఉంటాయి. కాని, సుఖాల కన్నా దుఃఖాలే ఎక్కువగా ఉంటాయి.

చేయకూడని ఆలోచనలు గతంలో ఎన్నో చేశాం. చేయకూడని కర్మలను పని గట్టుకొని మరీ చేశాం. నిజమే. గతం అలాగే నడిచి ఉంటుంది. గతంలో నిర్దోషంగా జీవించి ఉంటే ఈ రోజు, ఈ జన్మలో ఇలా అలమటించే వాళ్ళం కాము కదా!

బుభుక్షితః కిమ్ న కరోతి పాపమ్?

ఆకలితో బాధపడే వాడు ఏ పాపం చేయడు? అనే అందమైన మాటను శాస్త్రం పలికింది. నిజమే. ఆకలి దుర్భర మైనపుడు మనిషి ఏ పాపమైనా చేస్తాడు. అదంతా ఆకలే చేయిస్తుంది. ఆకలితో ఉన్నవాడు పాపం చేసినట్లు, అజ్ఞానంలో అలమటించే వాడు దోషాలకు నిలయంగా మారుతాడు. అలాగే, అందరమూ గతంలో ఎన్నో తప్పులు చేసి ఉంటాము. చేశాము. నిన్న తప్పు చేశాం. నేడు జ్ఞానం కలిగింది. జ్ఞాన జలంతో పాప పంకిలాన్ని కడిగేసు కోవాలి. అంతేగాని, నిన్నటి పాపాన్ని చింతిస్తూ కూర్చుంటే, నేడు కూడా జారి పోతుంది.

ఒక్క మాట అడుగుతాను. ఇక్కడ ఉన్నవారు ఎవరు ఏ తప్పులు చేశారో, ఎన్ని తప్పులు చేశారో అలా ప్రక్కన పెట్టండి. ఈ రోజు మనం ఇక్కడ ఉన్నాం. శ్రుతిమందిరంలో ఉన్నాం. ఇలా ఉంటామని మనం ఊహించామా? మీరు ఊహించారా? నేను ఊహించానా? చెప్పండి.

మనం ఊహించక పోయినా జరిగింది. ఇందులో ఏదో ఉంది. మీకు తెలియనిది ఉంది. నాకు తెలియనిది ఉంది. ఏదో మనకు తెలియకుండా జరిగిపోతూ ఉంది. అదేదో జరగ నివ్వండి. కాస్త ప్రశాంతంగా ఉంది. దీనినే మనః ప్రసాద మన్నది భగవద్గీత. మానసిక తపస్సుగా అభివర్ణించింది.

మనః ప్రసాద స్సౌమ్యత్వం మౌన మాత్మ వినిగ్రహః
భావ సంశుద్ధి రిత్యేతత్ తపో మానస ముచ్యతే ॥ (17-16)

మనస్సును స్వచ్ఛంగా ఉంచుకోవడమే మనసు యొక్క ప్రసాదము లేదా ప్రసన్నత (**మనసః ప్రసాదః స్వచ్ఛ ప్రశాన్తిః, స్వచ్ఛతాపాదనం మనసః ప్రసాదః**).


గతాన్ని పూర్తిగా అంగీకరించాలి. జరిగింది జరిగి పోయింది. చేయగలిగింది చేశాం. అలా చేయడం వెనుక కారణాలు ఉన్నాయి. అలాగే మనకు రాగలిగిందే వచ్చింది. అలా రావడం వెనుక కూడా ధర్మాలు ఉన్నాయి. ఇలా అర్థం చేసుకొంటూ జీవించాలి. ఇదే సరియైన జీవన మార్గము.

వర్తమానం - వరప్రదం


గతాన్ని ఎలా అంగీకరించామో వర్తమానాన్ని కూడా అలాగే అంగీకరించాలి.

(24వ పేజీ చూడుము)

యజ్ఞ పోషకులు




శ్రీ ఎమ్.అనంత లక్ష్మణ కుమార్
అమెరికా
రూ.50,000/-



శ్రీ డి.శ్రీనివాసులు రెడ్డి
హైదరాబాద్
రూ.50,000/-

మహారాజ పోషకులు
(రూ.10,000/-)




శ్రీ ఎ.రంగయ్య
హైదరాబాద్, రూ.25,000/-



శ్రీమతి డా॥ పి.శ్రీజ
నిర్మల్, రూ.24,224/-




శ్రీమతి డి.శైలజ
శ్రీ డి.అశోక్ కుమార్
వైజాగ్, రూ.15,000/-




శ్రీ జి.ప్రతాప్ కాశ్యప్
హైదరాబాద్



చి॥ వైకృతి
హైదరాబాద్



శ్రీ ఎ.భరత్ రామ్
హైదరాబాద్




శ్రీ కె.జైపాల్
హైదరాబాద్



శ్రీమతి ఎస్.ఎస్.కాంతం
ఆశ్రమం




చి॥ కె.సరళ
హైదరాబాద్



శ్రీ యు.ఆగమయ్య
హైదరాబాద్




శ్రీమతి డా॥ ఎ.లక్ష్మీ ప్రసన్న
చిత్తూరు



శ్రీ ఎ.చెన్నకేశవ రెడ్డి
శ్రీ ఎ.జితేంద్ర రెడ్డి
హైదరాబాద్


మహారాజ పోషకులు
(రూ.10,000/-)




శ్రీమతి పి.జానకీ దేవి
విజయవాడ




చి॥ పి.ఆశ్రిత భుజంగం
చెన్నై



శ్రీమతి జి.పద్మ
శ్రీ జి.భిక్షపతి
హైదరాబాద్



శ్రీ ఎస్.పాండులింగం
హైదరాబాద్



శ్రీ ఎ.రామిరెడ్డి
హైదరాబాద్



శ్రీ ఎస్.వెంకటరావు
రాజమండ్రి



శ్రీమతి ఎన్.ఆదిలక్ష్మి
శ్రీ ఎన్.శ్రీనివాసరావు
హైదరాబాద్

సుందర సత్సంగ శాఖలు

మహారాజ పోషకులు



విజయవాడ
రూ.12,000/-

ఒంగోలు
రూ.12,000/-

గుంటూరు
రూ.10,116/-

వరంగల్
రూ.10,000/-

రాజమండ్రి
రూ.12,000/-

కర్నూలు
రూ.10,116/-



రాజపోషకులు
(రూ.5000/-)

చీడిగ, కోరుట్ల, తణుకు, కాకినాడ, గోదావరిఖని, షోలాపూర్, గుమ్మడిదల, ఆసిఫాబాద్, హనుమకొండ, లాల్‌పేరం, దీపాయిగూడ, గజ్వేల్, చీరాల

(21వ పేజీ తరువాయి)

నేడు ఉండదగిన చోటే మనం ఉన్నాం. ఉండదగిన వ్యక్తులే మన చుట్టూ ఉన్నారు. మనం తయారు చేసుకున్న పరిస్థితులే మన చుట్టూ ఉన్నాయి. వీటన్నిటిని మనః ప్రసాదంతో ఒకేసారి అంగీకరించాలి.

ఇవి చూడటానికి చిన్న విషయలే కావచ్చు. వీటిని అర్థం చేసుకొని, తదనుగుణంగా జీవించ గలిగితే మనం పెద్దగా సుఖపడతాము.

వర్తమానంలో నిరాశ లేకుండా జీవించడం అలవరచు కోవాలి. మనది ఒక్క రోజు జీవితం. ఈ సత్యాన్ని వివేకంతో అర్థం చేసుకోవాలి.

ఒక రోజు మనం ప్రపంచం లోకి వచ్చాం. ఒకనాడు ఈ ప్రపంచం నుండి నిష్క్రమిస్తాం. ఈ రోజు ఉన్నాం. అందుకే అంటున్నాను మనది ఒక్కరోజు జీవితం అని.

నేడు ఉన్నాం. రేపు ఉంటామో లేదో చెప్పలేము. ఉండక పోవచ్చు కూడా. అంత మాత్రాన చింత ఎందుకు? ఎలాగో ఒకనాడు పోయే వాళ్ళమే. నేడు ఉన్నందుకు సంతోష పడాలి. నేడు చేయగలిగింది చేయాలి. నేటిని వినియోగించుకుంటే రేపు వస్తుంది.

నేడు ఎలాగైతే ఒక్క రోజో, రేపు అనేది ఒకవేళ వస్తే అది కూడా ఒక్క రోజే. ఇదొక అద్భుతమైన సత్యం. శ్రమించి బుద్ధికి పట్టించ వలసిన జీవన సత్యం.

అన్నం కావలసింది ఒక్క రోజుకే. బట్ట కట్టేది ఒక్క రోజుకే. అన్నం తినేది ఒక్క రోజుకే. నిజం చెప్పాలంటే ఒక్క పూటకే. ఒక్క రోజు హాయిగా, ఆనందంగా సాగిపోతే, బ్రతికి నంత కాలం హాయిగా సాగిపోతుంది. మితిమీరిన భారాలు బ్రతుకును క్రుంగ దీస్తాయి. గాలి పీలుస్తూ ఉంటేనే మనం బ్రతుకుతాం. మాసానికి, లేదా వారానికి, లేదా ఒక రోజుకి కావలసిన గాలి నంతా ఈ క్షణం లోనే పీల్చుకోవాలా? అది సాధ్యమేనా?

మనం గాలి పీల్చేది ఒక్క క్షణం. ఆ గాలి ఈ క్షణానికే. క్షణం క్షణం పీల్చుతూ ఉంటే ఎన్ని క్షణాలైనా బ్రతుకుతాం. అలాగే రోజు రోజు ఆనందంగా జీవించ గలిగితే ఎన్ని రోజులైనా ఆనందంగా బ్రతకగలం.

మన శక్తిని ఉపయోగించుకొని మనం చేయవలసిన విహిత కర్మలను చేస్తూ పోవాలి. ఇతరులు మనకు సహకరిస్తే సహాయం తీసుకోవడంలో తప్పు లేదు. సహాయం అవసరమై ఉండి, ఎవరి సహాయము మనకు అందనపుడు భగవంతుని ప్రార్థించాలి. అద్భుతమైన సహాయాన్ని అచ్యుతుడు అందిస్తాడు. మనం చేసే కార్యాలు మనకు తృప్తి నిస్తే చాలు. ఇతరులకు మనల్ని మనం బుజువు చేసుకోవలసిన అవసరం లేదు. మనం సన్మార్గంలో చరిస్తున్నా, ఇతరులు మనది దుర్మార్గం అని ఊహించుకుంటే, వాళ్ళను అలా ఊహించుకోనీ. అదంతా వాళ్ళ సమస్యే గాని మనది కాదు.



మోపే వారు నిందలు ఎందరో
మోసే వాడివి కాబోకు
కాకి కూతలు ఎవరికి మధురము
కోకిల రవమే కమనీయము
సహనమె సంపద పగయే ఆపద
సద్గతి కిదియే సోపానము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

నా కేదో లేదు. నేను చాలా చిన్నవాణ్ణి అనే న్యూనత భావం కూడా దూరం కావాలి. అప్పుడే వర్తమానం ఆనందంగా సాగుతుంది.

న్యూనతలు, అభద్రతలు అసౌకర్యాన్ని కల్పిస్తాయి. సుఖం లేకుండా చేస్తాయి. మనకు ఏమి లేదని ఈ విచారము? లేక, ఎవరికో ఏదో ఉంది అనేది మన ఆరాటమా? ఎవరికి ఏదుంటే మన కెందుకు? మనకు అవసరం లేనివి ఎంత గొప్పవి అయితే మాత్రం ఏం ప్రయోజనం? భాగ్యాల పేరిట భారాల్ని ఎత్తుకోవడం తేలికే. కాని, బ్రతికినంత కాలం భారాల్ని మోయడం తేలిక కాదు.

uneasy lies the head that wears the crown

కిరీటం ధరించిన తలకు అసౌకర్యమే ఉంటుంది అంటాడు షేక్స్పియర్. ఇది అక్షర సత్యం.

ఇకపోతే, మనకు లేనివే మనకు నిరాశను కలిగిస్తాయి. మనకు ఏమి లేదని నిరాశ పడాలి? భగవంతుడు మనవాడు. ఇక మనకు లేని దేముంది? ఇది అర్థమైతే వర్తమానం వరప్రదమే.

భవితవ్యం భవత్యేవ

భవిష్యత్తును గూర్చి ఎవరు ఎన్ని కలలు గనినా అడ్డు తగిలేవారు ఎవ్వరూ లేరు. కాని, ఒక్కటి మనకు అర్థం కావాలి. రేపటిని గూర్చి ఊహా లోకాల్లో మనం తేలి పోవచ్చు. కాని, నేడు చేయగలిగింది మాత్రమే చేయగలం. నేడు చేయగలిగింది చేస్తే రేపు చూడ గలిగింది చూస్తాం. జరగవలసింది జరిగి తీరుతుంది **(భవితవ్యం భవత్యేవ)**.

ఈ ప్రపంచం వింత లొలికే ఒక సంత. ఇక్కడ కొన్ని కొనేందుకు ఉన్నాయి. కొన్ని కనుగొనేందుకు ఉన్నాయి. నిజం చెప్పాలంటే, మొదటి వాటి కన్నా రెండవ కోవకు చెందినవే ప్రధానమైనవి. ఈ ప్రపంచ సంతలో మనం ఏమి చేస్తున్నామో మనల్ని ఇక్కడికి పంపించిన వాడు చూస్తూనే ఉంటాడు. ఇక్కడ ఎవరు దేనిని పొందినా దానిని అనుగ్రహించే వాడు మాత్రం తానే.



అతని దగ్గర ఎన్నో ఉన్నాయి. అన్నీ ఉన్నాయి. శ్రద్ధతో అడిగితే అతడు దేని నైనా ఇస్తాడు. అతడు అన్నీ ఇస్తాడు. కాని, ఒక్కటి మాత్రం ఇవ్వడు. ఎందుకని? అది ఎవ్వరూ అడుగరు కనుక. ఏమిటది? అది ఏదో కాదు. తానే. తానే అది.

మాకు అది ఇవ్వు - ఇది ఇవ్వు అని అతని వద్ద ఉన్న వాటిని అర్థించే వారే గాని, భగవాన్! మాకు అవన్నీ వద్దు. నీవే కావాలి అని అడిగే వారు ఎవరున్నారు? ఎంద రున్నారు? ఎవరు, ఎందరు అని కాకుండా, ఎవరు అడుగుతారో వారే ధన్యులు (**తే ధన్యాః భువి పరమార్థ నిశ్చితేహాః**).

అవసరం లేని వాటిని విస్మరిస్తేనే, అవసరమైన దానిని స్మరించగలం. (1) గతాన్ని మరచి పోవాలి. (2) వర్తమానంలో ఆందోళన లేకుండా జీవించాలి. (3) భవిష్యత్తును గూర్చిన భయాలను మనసు నుండి దూరం చేసుకోవాలి.

ప్రపంచం బయట ఉంటుంది. కాని పరమేశ్వరుడు లోపల ఉండాలి. భుజాలపై సంసారం ఉంటే తప్పు లేదు. బుద్ధిలో భగవంతుడు దూరమైతే మాత్రం ముప్పు తప్పదు. విత్తం విశ్వానికి - చిత్తం విశ్వపతికి. . . ఇదే రహస్యం. కర్మయోగం రహస్యం.

చేతసా సర్వ కర్మాణి మయి సన్న్యస్య మత్పరః
బుద్ధి యోగ ముపాశ్రిత్య మచ్చిత్తః సతతం భవ ॥

అర్జునా! చిత్తము చేత (**చేతసా - వివేక బుద్ధ్యా**) సర్వ కర్మములను నా యందు (**మయి - ఈశ్వరే, పరమేశ్వరే**) సమర్పించి, మత్పరాయణుడవై, బుద్ధి యోగమును ఆశ్రయించి, సదా నా యందే చిత్తము కలవాడవు కమ్ము! (**మచ్చిత్తః మయ్యేవ చిత్తః, సతతం సర్వదా**) అన్నాడు గీతాచార్యుడు. అందరూ యోగులై, కర్మయోగులై, జ్ఞానయోగులై, జ్ఞానులై తరించెదరు గాక!


ఓం. . . ఓం. . . ఓం. . .

శకునాలు

స్వామి సుందర చైతన్యానంద

న కాలస్య ప్రియః కశ్చిన్నద్వేష్యః

కాలానికి ఒకరు ఇష్టులు కారు, మరొకరు అనిష్టులు కారు. కాలానిది ధర్మదృష్టి. అధర్మ దృష్టి కాదు.



కాలంలో ఏది జరిగినా, దాని వెనుక ధర్మా లుంటాయి. అవి అర్థం కాకపోతే, దోషం కాలానికి ఆపాదించ బడుతుంది.

ఈ ప్రపంచంలో జీవులున్నారు. వస్తువు లున్నాయి. విషయాలున్నాయి. సన్నివేశా లున్నాయి. కాని, ఇవేవీ స్వతంత్రంగా లేవు. ప్రతిదీ మరొక దానితో ముడిపడి ఉంది. ఈ సంబంధం శాస్త్రీయంగా, సహేతుకంగా అర్థమైతే, ఆ తరువాత ఏ ఒక్కటి అర్థమైనా సర్వం అవగత మవుతుంది.

మేఘం యొక్క తీరును బట్టి వర్షము యొక్క ఆగమనాన్ని చెబుతారు. వర్షం లేదు. కాని, రాబోతుంది అని ఊహిస్తాము. ఈ ఊహ వెనుక అవగాహన లేదనగలమా? అసందర్భ ప్రలాపంగా కొట్టిపారేయ గలమా?

భూగర్భ జలాలను పరిశోధించటంలో శాస్త్రీయ పరికరాలను వినియోగించకుండానే భూమి ఉపరితలాన్ని పరీక్షించి నిర్ణయించే విధానాన్ని మనం కాదని తోసేయ గలమా?

'కాకి అరుస్తూ ఉంది. ఎవరో బంధువు లొస్తున్నారు'

వచ్చేవి కాకికి ఎలా తెలుసు? భవిష్యత్తులో జరుగబోయేవి తెలుసుకొనే జ్ఞానం కాకికి ఉందా? లేదు. ఉండబోదు.

కాకి అరుపులో భవిష్యత్కార్యం ఉందని ఎవరు చెప్పారు? ఇంటివైపు వస్తున్న చుట్టం ఇంట్లో ఉన్న వారికి ఎలా కనిపిస్తాడు? ఇంటిపైనో, చెట్టుపైనో ఉన్న కాకికి కనిపిస్తాడు. దగ్గరవుతూ ఉంటే కాకి అరుస్తుంది. ఆ తరువాత వ్యక్తి ఇంట్లోకి వస్తాడు. లోనున్న వారికి ఏది భవిష్యత్తో, కాకికి అది వర్తమానం. కాకి అందించేది వర్తమానమే.

సరే. అలాంటప్పుడు ఎవరో వస్తున్నారు అనేందుకు బదులు బంధువు లొస్తున్నారు అని ఎలా చెబుతారు? ఇంటికి వచ్చేవారు ఎవరైనా పూర్వపు రోజుల్లో బంధువులే. ఇంటికి వచ్చి వాసాలు, కూసాలు లెక్కబెట్టేవారు పూర్వం చాలా అరుదు. వచ్చే వారెవరైనా బంధువులే

కనుక కాకి అరుపు వినగానే ఇంటిలోని వారు ద్వారం వద్దకు వచ్చి స్వాగతం పలికేవారు. ఎవరినీ ఇంటికి రానివ్వక, వచ్చిన వారిని ఉండనివ్వక, చిరాకుల విందుతో సాగనంపే సంప్రదాయానికి ప్రతిరూపంగా కనిపిస్తున్న నేటి సమాజంలో **'అతిథి దేవో భవ'** అనేది మ్రింగుడు పడని విషయమే కావచ్చు.

పక్షి శకునం. శకున మంటేనే పక్షి. సంస్కృతంలో పక్షిని **'శకునః'** అంటారు. **శకున్తిః -శకునిః-శకున్తః-శకునః-ద్విజః (పక్షి)** అని అమరకోశము.

తెలుగులో కూడా శకునము అంటే పక్షి. సాధారణంగా జరుగబోయే మంచిని సూచించే విషయాన్ని కూడా శకునము అంటాము. అది కూడా పక్షి ద్వారా సూచింపబడే శుభమునే శకునము అంటారు. అదే ఒకవేళ అశుభమైతే దుశ్శకునము అనాలి. కేవలం శకునము అంటే మాత్రము శుభము అనే అర్థము.

మరి, కుక్క ఏడిస్తే?

అది శకునం కాదు. ఎందుకని? కుక్క పక్షి కాదు కనుక. శకునం కానపుడు మరి అదేమిటి? అది నిమిత్తం. ఏదో ఆపదకు సూచితం.

కుక్కలు సహజంగా మొరుగుతాయి. అరుదుగా చెలగాట మాడుతాయి. ఎప్పుడో కాని ఏడవవు.

మొరగటం సహజం. చెలగాటం ఉత్సాహం. ఏడవటం కష్టం. కారణం లేకుండా కుక్క మొరగదు. ఆనంద మొస్తే చెలగాట మాడుతుంది. తీవ్రంగా ఆకలి వేస్తే ఏడుస్తుంది.

పట్టెడు అన్నానికి నోచుకోని పెంపుడు కుక్క దొంగను పట్టిస్తుందా? ఇదే భవిష్యత్తులో ఎదురయ్యే ఆపద. అండజేరిన వారిని ఆదరించలేకపోతే బ్రతుకే గుదిబండగా మారుతుంది.

కాకుల మీద, కుక్కల మీద ఈ భాష్యాలేమిటి బాబూ! అనిపించవచ్చు. నోరు లేని వాటినే ఇంత చక్కగా అర్థం చేసుకొనే సంస్కృతిలో మనసు, మాట ఉన్నవారిని ఇంకా ఎంత చక్కగా అర్థం చేసుకొనేవారో వేరే చెప్ప నవసరం లేదు. ఇదంతా పూర్వ వైభవం. మన పూర్వీకుల వైభవం.

పక్షి అరిస్తే శకునం అంటున్నాము. పిల్లి ఎదురైతే? కాలికి రాయి తగిలితే? ఇవి శకునాలు కావు. నిమిత్తాలు. రాబోయే ఆపదలకు సూచితాలు. చూసి నడవాలి. పరిశీలించి పానం చేయాలి. చూడకుండా నడిస్తేనే రాయి తగుల్తుంది. చూడకుండా నడవట మంటే కళ్ళు మూసుకొని పోవటం అని కాదు. చూడలేని స్థితిలో మనస్సు ఉందని అర్థము.

ఇలాంటి మనస్సు వ్యవహార యోగ్యతకు ఉపకరించదు. కార్యసాధనకు పనికిరాదు. కనుకనే, "కాసేపు కూర్చొని వెళ్ళు. కాసిన్ని చల్లని నీళ్ళు త్రాగి వెళ్తువు గాని" అనేవారు. చల్లని పానీయం త్రాగి, మనస్సును కూడా చల్లబరచుకొని వెళ్ళాలి అనేదే ఆంతర్యం.

అన్నిటితో అన్నీ ముడిపడి ఉన్న ఈ పవిత్ర సృష్టిలో వర్తమానం అటు భవిష్యత్తుతోను, ఇటు గతంతోను ముడిపడి ఉంది.

శకునాలు, నిమిత్తాలు వర్తమానాలే. కాని, భవిష్యత్తుకు దర్పణాలు.

నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవా!

"విపరీతములైన నిమిత్తాలను నేను చూస్తున్నాను కృష్ణా" అని కురుక్షేత్రంలో అర్జునుడు శ్రీకృష్ణునితో చెప్పాడు.

రాబోయే ఆపదలేవో అర్జునుని కళ్ళముందు దోబూచులాడుతున్నాయి. ఇవి నిమిత్తాలు. శకునాలు కావు. అందుకనే, **'నిమిత్తాని'** అనే పదాన్ని అందంగా వాడాడు అర్జునుడు.

అక్రూరుని రథం చుట్టూ లేళ్ళు ప్రదక్షిణం చేశాయి. అది నిమిత్తం. కంసుని తలపై గ్రద్ద రివ్వుమని తిరిగింది. ఇది శకునం.

నిమిత్త మనేది ఫలితాన్ని సూచించేదే గాని ఫలితాన్నిచ్చేది కాదు. ఫలితానికి కర్మే కారణం. నిమిత్త మనేది ఫలహేతువు కాలేదు.

మా కర్మ ఫలహేతుర్భూః మా తే సంగోఽ స్త్వ కర్మణి

"అర్జునా! కర్మఫలానికి నీవు హేతువు కావద్దు. అలాగని కర్మలను మానుట యందు ఆసక్తిని కలిగియుండకు" అన్నాడు శ్రీకృష్ణుడు.

కర్మఫలము ఏదైనా బంధమే. అందుచేతనే ఫలము నిష్ఫలము. మరి కర్మల యందు నిమిత్తంగా ఉండమంటున్నాడు.

"నాకు విపరీతములైన నిమిత్తాలు గోచరిస్తున్నాయి" అని ఫలాసక్తిలో పడి అర్జునుడు అల్లాడిపోతూ ఉంటే,

నిమిత్త మాత్రం భవ సవ్యసాచిన్

అంతా కాకతాళీయం నాయనా! కాకి కాలు పెడితే తాటి పండు పడుతుందా? ఇదే అహంకారం. పండు పడే స్థితిలో కాకి కాలు దాని మీద పడింది. అంతే. అర్థం చేసుకో.

కాకి నిమిత్తం కాదు శకునం అని నీవు అనుకున్నా తప్పులేదు. నీవు మాత్రం కర్మ రంగంలో నిమిత్తమని గ్రహిస్తేనే సుఖం.

జరగవలసింది జరిగి తీరుతుంది. ఇది ధర్మం. ధర్మంతో కరచాలనం చేస్తే బ్రతుకు పండుతుంది. కర్తృత్వంతో విర్రవీగట మంటే ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించటం. అధర్మంగా చరించటం. అధర్మం ప్రగతిని నిరోధిస్తుంది. పవిత్రతను పాడు చేస్తుంది. **మా కర్మ ఫల హేతుర్భూః** కర్మఫలానికి కారణం కావద్దు. మరి ఎలా ఉండాలి? **నిమిత్త మాత్రం భవ!** నీవు నిమిత్త మాత్రుడివిగా ఉండిపో.

ఇలా ఉంటూ **ఏం చేయాలి?** కర్మలే చేయాలి. కర్మలను మానకూడదు. **(మాతే సంగోఽ స్త్వ కర్మణి).** కర్మలలో వేగం తగ్గ నవసరం లేదు. అర్జునుడు రెండు చేతులతో

బాణాలు సంధించి సవ్యసాచి అయ్యాడు. నీవు కూడా పుష్కలంగా కర్మల నాచరించు. కానీ నిమిత్తమాత్రంగా ఉండు.

నిమిత్త మాత్రం భవ సవ్యసాచిన్!

గీత పదకొండవ అధ్యాయంలో పదకొండు అక్షరాలతో శోభిస్తున్న మహావాక్యమిది.

ఆత్మ బంధువులారా!

ఆనాడు అర్జునుడు పలికినట్లే నేడు అందరూ పలుకుతున్నారు. విపరీతములైన నిమిత్తాలు అందరికీ గోచరిస్తున్నాయి. అన్నీ శకునాలే. కాకి అరుపులే. ఈ అరుపులు నిమిత్తాలే గాని ఫలితాల నందిస్తాయా? రాజకీయం రాచపుండుగా మారింది. హింసలు సాగిపోతున్నాయి. విలువలు వీగిపోతున్నాయి. అసూయలు గాలుల్లా వీస్తున్నాయి. ద్వేషాలు వానలై కురుస్తున్నాయి. వంచనలు ఊరేగుతున్నాయి. ఇవన్నీ కూడా నిమిత్తాలే.

వీటి వెంట నడిచి ఏం సాధిస్తాం? వీటిని గూర్చి పలవరించి ఏం పొందుతాం? కాళ్ళు నొప్పి పుడితే నడిచేవాళ్ళు కూర్చుంటారు. నోళ్ళు నొప్పి పుడితే తెరిచిన నోళ్ళు మూసుకుంటాయి. నిమిత్తాలను విమర్శించటం, విమర్శలను పరామర్శించటం నేటి సమాజంలో సంస్కారులకు కర్తవ్యం కాదు. అర్థరహితమైన విషయాలలో కాలక్షేపం చేయటం విజ్ఞులకు వినోదం కాకూడదు.

నిమిత్తాలు స్పష్టంగా గోచరిస్తున్నాయి. నిజమే. ప్రగతి కాముకు లందరు కొన్ని నిర్ణయాలను సుస్పష్టంగా దర్శించి అమలు చేయవలసిన సమయమిది.

కాలాన్ని వృథా చేయకుండా జ్ఞానార్జనలో అందరూ తలమునకలై యుండాలి. ఏదో ఒక సత్కార్యాన్ని ఆచరించి తృప్తి చెందుతూ ఉండాలి. సామూహిక ప్రయోజనాన్ని సాధించే కార్యాలలో పాల్గొని హృదయాలను ఏకం చేసుకొని జీవించే అలవాటును పెంపొందించు కోవాలి.

మంచి చేసుకొంటూపోయే మనస్సుకు వంచనకు సమయముండదు. ప్రేమించుటకు అలవాటు పడినవారు ద్వేషించి హాయిగా నిద్రపోలేరు. సద్భావన సత్కర్మను ఆవిష్కరిస్తుంది. సత్కర్మలలోనే సత్పురుషులు దర్శన మిస్తారు.

దుర్జనః సజ్జనో భూయాత్
సజ్జనః శాంతి మాప్నుయాత్
శాంతో ముచ్యేత బంధేభ్యో
ముక్తశ్చాన్యాన్ విమోచయేత్

"దుర్జనుడు సజ్జను డగుగాక! సజ్జనుడు శాంతి నొందుగాక! శాంత చిత్తుడు బంధము నుండి ముక్తుడగు గాక! ముక్త పురుషుడు ఇతరులను ముక్తులను చేయు గాక! ఈ మార్గంలోనే నిమిత్తంగా మన ప్రయాణం. ఓం. ఓం. ఓం.

ఓ కథ చెప్పనా!

స్వామి సుందర చైతన్యానంద

అంతా ఈశ్వర వైభవమే



ఒకనాడు ఒక నదీ తీరంలో సాధ్వి రబియాను యోగి హసన్ చూశాడు. అంతే. అతనిలో అహంకారము, గర్వము విజృంభించాయి. వెంటనే తాను ప్రార్థనకై నేలపై పరచుకున్న వస్త్రాన్ని నదీ జలంపై వేసి, దాని మీద కూర్చుని తేలుతూ ఉన్నాడు. రబియా సమీపానికి రాగానే, వెటకారంగా నవ్వుతూ, 'రబియా! రా! ఇక్కడ చల్లగా ఉంది. నువ్వూ కూర్చుని ప్రార్థన చేసుకుందువు గాని!' అన్నాడు హసన్.

రబియా మందహాసాన్ని చిందిస్తూ, 'హసన్! అది నీ బలమని విర్రవీగకు. అది నీ బలం కాదు. బలహీనత. అది వైభవం కాదు, వికారము. చివరికి ప్రపంచ సంతలో వ్యాపారి లాగా ప్రదర్శన లివ్వడానికి సిద్ధ మయ్యావా?' అంటూ ఆమె చేతిలో ఉన్న వస్త్ర ఖండాన్ని గాలి లోకి విసిరింది.

ఆకాశంలో నిలబడి యున్న వస్త్ర ఖండం వద్దకు రబియా ఎగిరి వెళ్ళి, దానిపై ఆసీనురాలైంది. 'హసన్! అక్కడెందుకు? నీళ్ళల్లో తడుస్తాము. ఆ ప్రార్థనేదో ఇక్కడ చేద్దాము, రా! పైగా పై నుంటే, అందరూ చూస్తారు కూడా!' అంది రబియా.

హసన్ సిగ్గుతో తల దించుకున్నాడు. అది ఇష్టపడని రబియా, తన సహజ ప్రేమను చిందిస్తూ, 'చూడు హసన్! నువ్వు చేసిన ఆ వైభవాన్ని చేప కూడా చేసి చూపుతుంది. ఇక నేను చేసింది అంటావా, పక్షి అవసరం లేదు, పురుగు కూడా ఈ మాత్రం ఎత్తుకు ఎగురుతుంది. అసలైన వైభవము ఈ రెండిటి లోను లేదు. అదేమిటో తెలిసి సాధించుకోవాలి' అంది రబియా. ఆమె హిత వచనాలతో హసన్‌లో గొప్ప పరివర్తన చోటు చేసుకుంటుంది.

ఈశ్వర విభూతి అర్థమైతే, ఆ తరువాత మన బుద్ధిలో కలిగే, మన బుద్ధి నుండి కదిలే ప్రతి భావన ఈశ్వర వైభవ కిరణంగా ప్రకాశిస్తుంది. కారణం, ఈశ్వర వైభవాన్ని సాక్షాత్తు ఈశ్వరుడే వర్ణిస్తూ ఉన్నాడు కనుక.

ప్రబోధించబడే విషయం భగవత్తత్త్వం. వ్యక్తమయ్యే ఐశ్వర్యం భగవద్విభూతి. ఈ రెండిటిని చెప్పే మాటలు ఈశ్వరునివి ***(మే పరమం వచః)***. అంతా విభూతియే.

(36వ పేజీ చూడుము)

మహిష్మతిలో శంకరయతి

ధారావాహిని-2

స్వామి సుందర చైతన్యానంద

తుషాగ్నిలో కుమారిలుడు

శ్రీ శంకరులు శీఘ్రంగా కుమారిలుని సమీపించారు. ధాన్యపు పొలాల్లో తుషాగ్నిలో ప్రవేశించిన కుమారిలభట్టు దేహం అప్పటికే క్రింది భాగ మంతయూ దగ్ధమై పోయింది. దేహం దగ్ధమౌతున్నా కుమారిలుని మోము దివ్యంగా ప్రకాశిస్తోంది. విలక్షణమైన ప్రశాంతత ప్రస్ఫుటంగా శోభిస్తోంది. పొగతో కప్పబడిన ఆ మహితాత్ముని మొగము మంచు బిందువులతో కప్పబడిన కమలములా శోభించినది అని శంకర విజయములో వర్ణించ బడింది.



ధూమాయమానేన తుషానలేన
సందహ్యా మానేఽ పి వపుష్యశేషే ।
సంధృశ్యమానేన ముఖేన బాష్ప
పరీత పద్మ శ్రియ మావధానమ్ ॥

మంచుతో కప్పబడిన పద్మము లాగ పొగతో కప్పబడిన కుమారిలుని ముఖ పద్మమును శ్రీ శంకరాచార్యులు చూశారు. అంతేగాదు. కుమారిలుని మహాయాత్రను చూస్తూ, చుట్టూ నిలబడి నిస్సహాయ స్థితిలో కన్నీటిని కార్చుచున్న కుమారిలుని శిష్యులను కూడా చూశారు శ్రీ శంకరులు.

'దేహమును ఇంత భయంకరముగా దగ్ధము చేసికొనుటకు గల కారణ మేమి?' అని ఆచార్యులు కుమారిలుని ప్రశ్నించారు.

'నేను రెండు మహా పాపకార్యాలు చేశాను. ఈ విధమైన ప్రాయశ్చిత్త కర్మము ద్వారా ఆ పాపాల నుండి విముక్తుడను కావాలని భావించాను. నేను బౌద్ధ గురువును స్వీకరించి, ఆ తరువాత తిరస్కరించాను. ఇది నేను చేసిన మొదటి పాతకము. జగత్కర్త యైన పరమేశ్వరుని తృణీకరించాను. ఇది నేను చేసిన రెండవ పాతకము', అన్నాడు కుమారిలభట్టు.

'మీరు పవిత్రులు. పాతకము నెరుగరు. మీది సత్యవ్రతము. సర్వులకు సమ్మతము. ఆదర్శము. మీరు సమ్మతిస్తే, ఇప్పుడే నేను కొన్ని జలబిందువులను మంత్రించి మీపై చల్లుతాను. మీరు మళ్ళీ దివ్యారోగ్యంతో విరాజిల్లుతారు' అన్నారు శ్రీ శంకరులు.

'ఓ విద్వన్మణీ! నేను నిరపరాధిని అని నాకు తెలుసు. నన్ను పునర్జీవింప చేసే శక్తి గల మహిమాన్వితుడవు నీవు అని కూడా నాకు తెలుస్తూనే ఉంది. వైదిక ధర్మోద్ధరణకై

నేను కొన్ని నిషిద్ధ కార్యాలను చేయవలసి వచ్చింది.

ఏ బౌద్ధ గురువు వద్ద నేను బౌద్ధాగమముల రహస్యాలను గ్రహించానో ఆ గురువునే పండిత సభలో వేదధర్మోద్ధరణకై తిరస్కరించాను. తృణీకరించాను. బౌద్ధమత ఖండనము, వేదధర్మ మండనము నా ప్రధాన ఆశయమై ఉన్నందున అలా చేశాను. ఈ విధంగా బౌద్ధమును స్వీకరించినట్లే అభినయించి బౌద్ధమును ఖండించాను. గురువును ధిక్కరించాను.

జైమినీ మహర్షి ప్రబోధించిన కర్మమత రక్షణకై నేను ఈశ్వరుని కూడా ఖండించాను. దీని వలన మీమాంస దర్శనము నిరీశ్వర వాదమును ప్రవచిస్తున్నది అనే భ్రాంతి జనులకు కలిగింది. కానీ ఇది సత్యదూరమైన విషయము. కర్మ ప్రాధాన్యతను వివరించుట మీమాంస మతము యొక్క ప్రధానోద్దేశ్యమై ఉండగా, నేను దానికి భిన్నంగా, కర్మ వైశిష్ట్యమును వివరించే ప్రయత్నములో జగత్కర్తను నిందించుట జరిగింది. ఇది నా రెండవ అపరాధము.

దోషద్వయ స్యాస్య చికీర్షు రర్హన్ యథోదితాం నిష్కృతి మాశ్రయాశమ్ ।
ప్రావిక్ష మేషా పునరుక్త భూతాః జాతా భవత్పాద నిరీక్షణేన ॥

ఈ రెండు పాతకముల నుండి విముక్తిని పొందుటకు నేను ఈ ప్రాయశ్చిత్త కర్మను చేసుకొంటున్నాను. పూజనీయా! నీ పాద దర్శనము చేత నా ఈ ప్రాయశ్చిత్తము పునరుక్తమై, ద్విగుణీకృత పవిత్రతను సంతరించు కున్నది.

మీరు భాష్య రచన చేసినట్లు నేను విని యున్నాను. దానికి వివరణము వ్రాయాలనే కుతూహలము నాలో మెండుగా యుండేది. కానీ నా వ్రత నియమాన్ని ఉల్లంఘించే పరిస్థితిలో నేను లేను', అని పలికి ఆచార్యులకు పూజ చేయవలసిందిగా శిష్యులకు చెప్పాడు కుమారిలుడు. శిష్యులు శ్రీ శంకరాచార్య స్వామికి పూజ చేశారు. కుమారిలభట్టు తృప్తి చెందాడు.

'మహాత్మా! నా వ్రతము నిర్విఘ్నముగా సాగి పోతుంది. ఈ దేహము మరి కొన్ని క్షణాల్లో బూదియై పోతుంది. నా అంతరాత్మ పవిత్రంగా ఉంది. దోషపూరిత మైనవి నా భావాలు మాత్రమే. వాటికే ఈ ప్రాయశ్చిత్తం జరుగు చున్నది.

నాకు మండనమిశ్రుడనే శిష్యు డున్నాడు. అతడు మహిష్మతీ నగరంలో ఉంటాడు. అతడిని వేదాంత మార్గము లోకి మరలించండి. వేదాంత ప్రచారానికి వినియోగించండి. ఆ పండితుని వలన అద్వైత కీర్తికౌముది విశ్వ నభో మండలమున దివ్యంగా ప్రకాశిస్తుంది' అని పలికి శ్రీ శంకరులకు నమస్కరిస్తూ తనువును త్యజించారు కుమారిలభట్టు.

దేహాలు ఏనాడైనా దహింప బడకపోవు. ఈ లోగా ధర్మం కొరకు కొందరు, త్యాగం కొరకు కొందరు, స్వార్థం కొరకు కొందరు, ఖ్యాతి కొరకు కొందరు, వ్యర్థమైన విషయాలకై మరి కొందరు దేహాలను త్యాగం చేస్తూ ఉంటారు. ధర్మ రక్షణకై కుమారిలునిలా, త్యాగ నిరతితో దధీచిలా ఎందరు త్యాగం చేయగలరు?

కుమారిలుని జీవితం ఈ విధంగా ముగిసింది. ఆచార్యదేవుని దర్శిస్తూ దేహాన్ని

త్యజించడం కుమారిలుడు చేసుకున్న పుణ్యానికి ప్రత్యక్ష ఫలం. పవిత్రాత్ముడైన కుమారిలభట్టు మరణానికి దారి తీసిన పుణ్యగాథను మననం చేసుకుందాం! ఆ మహితాత్ముని జీవితం లోని విశేషాంశాలను వివరించుకుందాం!

కుమారిలుడు - ధర్మకీర్తి

కుమారిలుని జీవిత విశేషములు సుస్పష్టంగా తెలియుట లేదు. టిబెట్టు లోని ప్రసిద్ధ చారిత్రక పండితుడు తారానాథుడు చెప్పిన దానిని బట్టి కుమారిలుడు గొప్ప సిరిసంపదలు గల గృహస్థుడని తెలుస్తోంది. పంటపొలాలు విశేషంగా ఉండేవని, సుమారు వెయ్యి మంది దాసీజను లుండేవారని, చూడామణి దేశపు రాజు వద్ద ఈయనకు విశిష్ట గౌరవాదులు ఉండేవని వదంతి. ప్రసిద్ధ బౌద్ధాచార్యుడగు ధర్మకీర్తితో ఈయన శాస్త్రార్థము చేసి పరాజితుడైనట్లు, దాని ఫలితంగా బౌద్ధ ధర్మమును స్వీకరించినట్లు తారానాథుడు విపులంగా రచించాడు.

ధర్మకీర్తి బ్రాహ్మణుడు. ఆయన తండ్రి కోరునందుడు. త్రిమలయవాసి యగు ధర్మకీర్తి బ్రాహ్మణుడైనను అతని స్వభావము చాలా ఉద్ధతముగా ఉండేది. వైదిక ధర్మము నందు ఏ మాత్రము విశ్వాసము లేకుండా ఉండేవాడు. బౌద్ధుల ఉపదేశాలను అధికంగా శ్రవణము చేయుట చేత అతనికి బౌద్ధధర్మము నందు మక్కువ ఎక్కువగా ఉండేది. నలందా విశ్వవిద్యాలయంలో పీఠాధ్యక్షుడుగా ఉండిన ధర్మపాలుని వద్ద బౌద్ధ ధర్మ శాస్త్రాలను అధ్యయనం చేశాడు.

బ్రాహ్మణ దర్శనముల లోని నిగూఢ విషయాలను అధ్యయనం చేయాలని సంకల్పించాడు. ఆ సమయాన కుమారిలభట్టును మించిన వైదిక దర్శనవేత్త మరొకడు లేడు. అందుచేత కుమారిలుని ఆశ్రయించి వైదిక ధర్మ రహస్యాలను గ్రహించాలని అభిప్రాయ పడ్డాడు.

కుమారిలుడు వైదిక దర్శనమును బౌద్ధులకు చెప్పడు. ధర్మకీర్తి తీవ్రంగా ఆలోచించాడు. ప్రబలమైన తన కోర్కెను తీర్చుకొనుటకు పరిచారక వేషమును ధరించి, కుమారిలుని ఇంటిలో పనులు చేయడం ప్రారంభించాడు. చాలా మంది కలిసి చేయ దగిన కార్యాన్ని తానొక్కడే చేసేవాడు. ఈ విధంగా కుమారిలుని ప్రసన్నం చేసుకున్నాడు. కుమారిలుని భార్య అభిమానాన్ని చూరగొన్నాడు. ఆమె మాట ననుసరించి బ్రాహ్మణ విద్యార్థులతో పాటు ధర్మకీర్తికి పాఠాలు చెప్పుటకు కుమారిలుడు అంగీకరించాడు.

ఐశ్వర్యవంతుడైన ధర్మకీర్తి విద్యార్జనకై పరిచారకుడుగా పని చేశాడు. దీనిని బట్టి ఆ రోజుల్లో విద్యార్జనపై ప్రీతి ఎలా ఉండేదో మనం ఊహించవచ్చు. అంతేగాక, గురువును తృప్తి చేయగలిగితే, పరిచారకులకు కూడా గురువు శాస్త్ర రహస్యాలను వెల్లడించునని కుమారిలుడు ధర్మకీర్తికి బోధించిన విషయము ననుసరించి గ్రహించ వచ్చు.

(36వ పేజీ చూడుము)

స్పందన

స్వామి వారి పాదపద్మములకు శతకోటి ప్రణామములు

స్వామీ! మీ పేరు లాగా మీ కార్యక్రమాలు కూడా సుందరముగా, చైతన్యవంతముగా ఉంటాయి. మీరు నిర్దేశించే మార్గంలో నడచిన ఎందరో జీవితాలు ధన్యమౌతున్నాయి. యాంత్రికంగా జీవనము సాగిస్తూ పరుగులు తీస్తున్న ఈ రాకెట్ యుగంలో జ్ఞాన సముపార్జనకు ఎవ్వరికీ తీరిక ఉండటం లేదు. అలాంటి వారికి కూడా ఉపయోగపడే లాగా, 'గిరిధారి'లో మీ రచనలు, టి.వి.లో మీ కార్యక్రమాలు, యజ్ఞాలలో మీ ప్రవచనాలు, అల్ప వ్యవధిలో అనంత జ్ఞానాన్ని ప్రసాదిస్తూ మానవాళిని చైతన్యవంతం చేస్తున్నాయి.

మీరు మా అందరి కోసం శ్రమించి తయారు చేసిన 'వెన్నముద్దలు' వి.సి.డి. చూశాం. నోటిలో పెట్టుకోగానే వెన్నముద్దలు కరిగి పోవునట్లు, మీ వెన్నముద్దల కవితలు మా హృదయాలలో కరిగిపోయాయి. అవి చూస్తూ ఉంటే మా కళ్ళల్లో ఆనంద బాష్పాలు నిండాయి. కొన్ని క్షణాలు మమ్మల్ని మేమే మరచిపోయాం.

పవిత్రమైన మార్గంలో మా ప్రయాణం సాగేలా ఆశీర్వదించమని ప్రార్థిస్తూ,

సదా మీ మార్గంలో

ఎన్.ఉమాదేవి, గోదావరిఖని

పదహారు సంవత్సరాల క్రితం

జీవితం ప్రశ్నార్థకంగా సాగుతూ ఉండిందే గాని, ఈ క్రింది ప్రశ్నలు కూడా ఉంటాయని, ఉన్నాయని కలలో కూడా భావించి ఎరుగను.

(1) నవ మాసాలు తల్లి గర్భంలో ఎలా ఉండినాను? ఎవరు పోషించారు?

(2) జన్మించిన తరువాత నాకు అవసరమైన సమస్తాన్ని సమకూర్చిం దెవరు?

(3) జీవించడానికి ముఖ్యావసరమైన ప్రాణవాయువును అందించిన అమృత హృదయం ఎవరిది?

(4) దేహేంద్రియ మనోబుద్ధులు ప్రకాశించి పని చేయడానికి కారకు లెవరు?

(5) రక్తోత్పత్తి వెనుక దాగియున్న నియతి ఎవరి చేతిలో ఉంది?

(6) జీవితంలో సుఖదుఃఖాలు ఎందుకు ప్రాప్తిస్తున్నాయి?

(7) కర్మఫలాలు ఎలా అందుతున్నాయి? ఎవరు అందిస్తున్నారు? వాటిని ప్రసాదంగా ఎందుకు స్వీకరించాలి? ఎలా స్వీకరించాలి?

పై ప్రశ్నలు కూడా ఉంటాయని ఆనాడు నాకు తెలియదు. అహంకార మమకారాలు, రాగద్వేషాలు దుఃఖ హేతువులని, ప్రపంచమే దుఃఖాలయ మని, అందులోను సుఖాలు

అల్పమని దుఃఖాలు అనంతమని తెలియని అజ్ఞాన దశలో అలజడుల మధ్య, ఆందోళనల మధ్య అంధకారంలో అలమటిస్తూ, గమ్యం తెలియని బాటసారిలా సాగిపోతున్న నాలో జ్ఞాన జ్యోతిని వెలిగించి,

సకల చరాచర భూతకోటి సృష్టి స్థితి లయములకు ఆధారమైన వాడు బ్రహ్మమని, జగత్కారణమై, ఏకమై వెలిగే ఆ బ్రహ్మము నీవే అని, అలలన్నీ సముద్రం కన్నా వేరు గానట్లు, అన్నీ నీ లోనే ఉన్నాయని, నీవే సుఖం, నీవే ఆనందం, నీవే అనంతం అంటూ సశాస్త్రీయంగా బోధించి, "తత్త్వమసి" మహావాక్య వైభవాన్ని నా హృదయంలో నిలిపిన,

పూజ్య గురుదేవులు, శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానందుల వారే నాకు తల్లి, తండ్రి, గురువు, దైవం, సమస్తమూను. బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపులైన గురుదేవుల పాదపద్మములకు మరల మరల నమస్కరించుచున్నాను.

వి.భాస్కర్, గోదావరిఖని


(34వ పేజీ తరువాయి)

ధర్మకీర్తి సూక్ష్మబుద్ధి గలవాడు. కొద్ది కాలము లోనే కుమారిలుని వద్ద వైదిక ధర్మ రహస్యాలను గ్రహించాడు. ఆ తరువాత తన నిజ స్వరూపమును బయట పెట్టి బ్రాహ్మణులను శాస్త్రార్థమునకై ఆహ్వానించాడు. అనేక మంది వైశేషిక పండితులను, బ్రాహ్మణ దార్శనికులను ఓడించాడు. చివరగా గురువైన కుమారిలుని కూడా శాస్త్రార్థమున ఓడించాడు.

(సశేషం)

(31వ పేజీ తరువాయి)

అంతా ఈశ్వర వైభవ మైనపుడు, నా దంటూ ప్రత్యేకంగా ఏముంది? నా నుండి వ్యక్తమయ్యే వైభవము పరమేశ్వరుని దైనపుడు, నాలో అహంకారానికి చోటెక్కడుంది? నా నుండి ఏ ఈశ్వర వైభవము వ్యక్త మవుతూ ఉందో, ఇతరులలో వ్యక్తమయ్యే వైభవము కూడా ఆ ఈశ్వర వైభవమే అయినపుడు, నాకు ఎవరిపై ఈర్ష్య? ఎవరిపై అసూయ? ఈ విధమైన భావాలతో బుద్ధి వికసిస్తూ విశాలమౌతూ, వినూత్న భగవ ద్భావనలో ఓల లాడుతుంది.



చైతన్య ప్రభంజనం

శ్రీ డి.వి.ఎన్.మల్లికార్జున శర్మ

కరుణాలయం

శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానంద సద్గురుదేవులు 2-5-2025 శుక్రవారం నాడు జగద్గురు ఆదిశంకర భగవత్పాదుల జయంతి వేడుకలను దుండిగల్ లోని శ్రీ సుందర చైతన్యాశ్రమంలో స్థానికంగా ఆహూతులైన భక్తులకు అనుగ్రహించారు.

వైశాఖ శుద్ధ పంచమి శ్రీ శంకర జయంతి. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి హిందువు భక్తి శ్రద్ధలతో యథాశక్తిగా ఆ జగద్గురువు వైభవాన్ని స్మరించుకునే పర్వదినం శ్రీ శంకర జయంతి. ఇక్కడ గమనించ వలసిన విశేషం ఏమనగా శ్రీ సుందర చైతన్యాశ్రమంలో అనునిత్యం శంకర జయంతి పర్వదినమే!

అందుకు కారణం ఆశ్రమ ప్రాంగణంలో ఒక దశాబ్ది క్రితం పూజ్య గురుదేవులు ఆవిష్కరించి సాకారం గావించిన సుందర స్వప్నం, శ్రీ ఆదిశంకర భగవత్పాదుల దివ్య సుందర ధామం, 'కరుణాలయం'. ఇటీవల పూజ్య గురుదేవులు లాంఛనంగా నామకరణం గావించిన జగద్గురు మందిరమే 'కరుణాలయం'.

పూజ్య గురుదేవులు దశాబ్దాల పాటు అవిశ్రాంతముగా బోధిస్తున్న శ్రుతి స్మృత్యాది సకల శాస్త్రములకు సజీవ సాక్షి 'కరుణాలయం'. జగద్గురు ఆదిశంకర భగవత్పాదులు అనవరతం ఆశీస్సులు అనుగ్రహిస్తూ, అద్వైత వేదాంత మార్గానుయాయులైన ఆధ్యాత్మిక సాధకులకు స్ఫూర్తి దాయకంగా దర్శనమిచ్చే ఆలయం 'కరుణాలయం'.

శంకర జయంతి నాటి బ్రహ్మ ముహూర్త సమయంలో జగద్గురునకు పల్లకీ సేవ, నగర సంకీర్తనలు నిర్వహించుట పూజ్య గురుదేవుల అనుగ్రహ విశేషం. అనుదినం నిత్య పూజాదికముల నందుకునే అర్చామూర్తి ఆదిశంకరుల వారికి, వారి జయంతి పర్వదినాన విశేష పూజ, అభిషేకము, నూత్న కాషాయ వస్త్రాలంకరణలతో పాటు రుద్ర పారాయణ మొదలగు సేవలతో దివ్య నామ సంకీర్తన పూజ్య గురుదేవుల ఆదేశానుసారంగా అద్భుతంగా నిర్వహించబడినవి.

పుష్పాలంకృతమైన పల్లకీలో శ్రీ శంకరాచార్యస్వామి వారి ఉత్సవ చిత్రాన్ని అత్యంత

శ్రద్ధాభక్తులతో ఆశ్రమ ప్రాంగణమంతా కాగడాలతో ఉత్సవంగా ఊరేగించడం చైతన్య భజనల గానంతో పాటుగా జరిగింది.

అన్నపూర్ణా క్షేత్రంలో ప్రసాద వితరణతో ఆనాటి ఉదయం ఆరాధన సమాప్తం కాగా సాయంకాలం 6 గంటలకు తిరిగి ఆచార్యుల వారిని ఆరాధించుకునే కార్యక్రమం పూజ్య గురుదేవులే స్వయంగా నిర్వహించారు.

ఈ ఆరాధన పూజ్య గురుదేవుల దివ్య గానామృత ప్లావితము. సామగాన లోలురైన జగద్గురువులకు అత్యంత ప్రీతిపాత్రమైన చైతన్య గాన సంకీర్తనలతో పూజ్య గురుదేవులు ఒక దివ్యమైన గానార్చన గావించి ఆ పవిత్ర ప్రసాదాన్ని శ్రోతలకు కూడా పంచి అనుగ్రహించారు. మరొక విశేషం ఆనాటి ఆరాధనోత్సవంలో చోటు చేసుకోవడం కేవలం పూజ్య గురుదేవుల వాత్సల్య విశేషమే! శ్రీ శంకరాచార్య స్వామి వారి జీవితం లోని అత్యంత ముఖ్య ఘట్టాలను పూజ్య గురుదేవులు ఎంతో ఆసక్తిదాయకంగా అంత అల్ప వ్యవధి లోనే వివరించారు. కేవలం వివరించడమే కాదు. మరొక మహాత్ముని జీవితం లోని ముఖ్య ఘట్టాలతో సరిపోల్చే తులనాత్మక పరిశీలనను కూడా అలవోకగా, అత్యంత మనోహరంగా కళ్ళ ముందు నిలిపారు. ఆ 'మరొక మహాత్ములు' మరెవరో కాదు. పూజ్య గురుదేవులే!

కారణ జన్ములైన మహాత్ములు వారి వారి ప్రారబ్దానుభవాలకు కాకుండా లోక సంగ్రహార్థం అవతరిస్తారని ఆస్తిక లోకానికి విదితమే. ఆ మహాత్ముల జీవితాలను పరిశీలిస్తే కూడా అదే సత్యం బోధ పడుతుంది. శిష్యకోటిని అనేక ఆపదల నుండి కాపాడ గలిగే మహాత్ములు తమ దేహాలను సంపూర్ణ ఆరోగ్య సుఖాలతో రక్షించుకోలేరా? ఆశ్రితుల పాప ఫలాలైన ఆధివ్యాధుల తీవ్రతను తగ్గిస్తూ ఆ మేరకు ఆ అనుభవాన్ని తాము ఆపాదించుకునే కరుణామయులైన సద్గురువులు భరతభూమిలో అన్ని కాలాల్లోనూ దర్శన మిస్తారు. అన్ని వ్యాధుల్లోకి అత్యంత తీవ్రతరమైన వ్యాధి సంసార వ్యాధి. ఇది అజ్ఞాన జనితము. ఈ వ్యాధిని పోగొట్టగల ఏకైక వైద్యులు కేవలం సద్గురువులే! 'గురుగీత' ఘోషించేది ఈ సత్యాన్నే! తమ స్వకీయ సౌఖ్యాల్ని స్వచ్ఛందంగా వదులుకొని సన్న్యాసాశ్రమ స్వీకారం చేసి లోకాన్ని పట్టి పీడించే భవ రోగాన్ని నిర్మూలించే అధ్యాత్మ విద్యా వితరణ చేయు సంకల్పంతో లోకంలో సంచరించే సద్గురువులు, జగద్గురువుల జీవన సారూప్యతలు యాదృచ్ఛికం కాదు. కేవలం దైవానుగ్రహ సంజనితాలు.

'మన చుట్టూ కనిపిస్తూ మనం జీవిస్తున్న ఈ ప్రపంచం, ప్రపంచంగా మిథ్య. పరమాత్మగా సత్యం' అంటూ పూజ్య గురుదేవులు తమ అనుగ్రహ భాషణను ఆరంభించారు. **'పరమ మంగళ సద్గురు దేవా'** అనే చైతన్య గీతికను గానం చేశారు. సర్వకారణుడైన సర్వేశ్వరుని అనుగ్రహంతో సంభవమయిన శంకరుల వారి జన్మ వృత్తాంతాన్ని పూజ్య గురుదేవులు వివరించారు. గృహాన్ని, మాతృమూర్తిని విడిచిపెట్టి దేశ పర్యటనకు బయలుదేరే

సమయంలో ఆ జగద్గురువు తల్లి ఆర్యాంబకు ఎటువంటి సమాధానాలు చెప్పి, మాతృ అవసాన సమయాన ప్రక్కన ఉండగలనని ప్రమాణం చేశారో పూజ్య గురుదేవులు కూడా అవే సమాధానాలు, ప్రమాణాలను మాతృమూర్తి రంగనాయకమ్మ గారికి వాగ్దానం చేసిన సామ్యాన్ని పూజ్య గురుదేవులు భీమవరం యజ్ఞస్థలి నుండి వెంకటగిరిలో ఉన్న మాతృమూర్తి పాదాల చెంతకు సాగిన తమ ప్రయాణం సాక్షిగా వివరించారు.

శ్రీకృష్ణ పరమాత్మను ఎంతటి భక్తితో ఆరాధించినా ఏదో ఒక అసంతృప్తి ఉండేదని, ఆచార్య శంకరులు ఆ అసంతృప్తిని సమూలంగా పోగొట్టి భక్తి జ్ఞానములు నిండుగా సమపాళ్ళలో నిలిచి పోయేటట్లు చేశారని పూజ్య గురుదేవులు ఆ ఇరువురు జగద్గురువులకు వందన సమర్పణగా **'భక్తియే బలము, దైవమే భాగ్యము - గురు సన్నిధిలో సిద్ధము మోక్షము'** అనే చైతన్య గీతికను, **' బ్రహ్మైవాహం కిల'** అనే సదాశివ బ్రహ్మేంద్రుల వారి కీర్తనను ఆలపించారు. అర్థాలను విశదం చేశారు. **'సత్యరూప జ్ఞానరూప అనంత రూప గురుదేవ'** మున్నగు చైతన్య భజనావళిని కూడా పూజ్య గురుదేవులు గానం చేశారు.

జగద్గురు ఆదిశంకరులను, శ్రీకృష్ణ పరమాత్మలను (గురుగోవిందులు) పూజ్య గురుదేవుల మోక్ష కారకులుగా పేర్కొంటూ తాము జీవన్ముక్తులమని సూచన ప్రాయంగా పూజ్య గురుదేవులు 'అంగీకరించడం' ఈ శంకర జయంతి పర్వదినాన జరిగిన సమస్త శుభాలను మించిన అపూర్వమైన, అపురూపమైన శుభవార్తగా శిష్యకోటిని పులకాంకితులను గావించినది. ఇది కేవలం మనందరి ప్రగాఢ విశ్వాసము మాత్రమే కాదని, ఒక సుందర, శుభకర, సుమనోహర, శాశ్వత సత్యమని పూజ్య గురుదేవులే తమ చల్లని చూపులతో, తీయని మాటలతో ప్రేమ పూర్వకంగా 'అంగీకరించి' అంతులేని ఆనందాన్ని, ఆధ్యాత్మిక స్ఫూర్తిని మనకు 'శంకర జయంతి' ప్రసాదంగా అనుగ్రహించి ఆశీర్వదించారు.

'శంకర జయంతి - 2025' వేడుకలు ఇటువంటి చారిత్రాత్మక ప్రాముఖ్యతను సంతరించుకుని సమాప్తమయినాయి.

పూజ్య గురుదేవులే స్వయంగా **'పవమాన సుతుడు పట్టు....'** మంగళ హారతిని ఆలపిస్తుండగా శంకర - సుందర గురుదేవులకు ఆనంద కర్పూర నీరాజన సమర్పణ జరిగింది. అనంతరం ప్రసాద వితరణతో జగద్గురు ఆరాధనోత్సవం సమాప్తమయింది.

సర్వమ్ శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానంద సద్గురు దివ్య చరణారవిందార్పణ మస్తు!

హరిః ఓమ్ తత్ సత్!



ఆత్మ బంధువులారా
ఓం నమో భగవతే వాసుదేవాయ.

సూర్యాస్తమయంతో విశ్వంలో వెలుగులు ఆరి పోతాయి. చీకట్లు ముసురు కుంటాయి. ఇవి బాహ్య తిమిరాలు. బాహ్యంలో చీకట్లు ఉన్నంత మాత్రాన వ్యక్తి ఆంతర్యంలో అంధకారం ఉండ నవసరం లేదు.

బాహ్యం లోని చీకట్లు మనల్ని బాధించవు. ఆంతర్యంలో చీకట్లు వ్యాపిస్తే బాహ్యంలో వెలుగు లున్నా వ్యక్తి గ్రుడ్డివాడు గానే మిగిలి పోతాడు. అస్తమించిన సూర్యుణ్ణి వెంటనే తీసికొని వచ్చి ఆకాశంలో ఉంచడం ఎవ్వరికీ సాధ్యం కాదు. కాని, హృదయాకాశంలో అస్తమించిన వెలుగుల్ని తిరిగి ఆవిష్కరించుకోవడం వివేకవంతులకు అసాధ్య మేమీ కాదు.

బాహ్యంలో ఒక్క వెలుగులే కావు; ఏవయినా మారుతూనే ఉంటాయి. ఒకే లాగ ఉండవు. అలాగని, వాటితో పాటు మనిషి కూడా తదనుగుణంగా మారుతూ పోతే, విశ్వంలో చీకట్లు వ్యాపించి నపుడు వాటి ప్రభావం మనస్సుపై కూడా ఉంటుంది. మనిషిపై ఉంటుంది. మనుగడే చీకటిమయ మవుతుంది. అది ఎంత దుర్భరమో ఆలోచిస్తే అర్థ మవుతుంది.

దుర్భర మైన మనస్సును కలిగిన దుర్బలులకు ధ్యాన మనేది దుర్లభం గానే ఉంటుంది. ధ్యాన మనేది పరమేశ్వరునికి సంబంధించి మనం సాగించే మానస వ్యాపారము. మార్పుల సంగీతానికి నాట్యం చేసే మనస్సు మార్పు లేని మహేశ్వరునిపై ఎలా ధ్యానం చేస్తుంది?

ధ్యానం చేయడానికి కొందరు పూజాగది లోకి వెళ్ళొచ్చు. కొందరు మందిరాలకు వెళ్ళొచ్చు. కొందరు వనప్రదేశాలకు పోవచ్చు. మరి కొందరు నదీతీరాలను చేరవచ్చు. ధ్యానం చెయ్యడానికి ఎవరు ఎక్కడికి పోతున్నారు? అనేది తెలియదగిన విషయం కాదు. కాని, ధ్యానం చేసే వారు అందరూ ప్రవేశించేది మనస్సు లోకే అనేది మాత్రం ధ్యాన యోగులకు తెలియవలసిన విషయం.

విహారయాత్రలకు ఒంటరిగా వెళ్తే సుఖముండదు. కొందరితో కలసి వెళ్ళాలి. కాని ధ్యాన విహారానికి వ్యక్తి ఒంటరి గానే వెళ్ళాలి. అప్పుడే సుఖం. అందుకనే ఏకాంతమున **(రహసిస్థితః)** ఒంటరిగా **(ఏకాకీ)** ధ్యానాన్ని ప్రారంభించ మన్నాడు గీతాచార్యుడు. ఏ సహాయ

మును లేనివాడుగా ఏకాకిని అభివర్ణించారు శ్రీ ఆదిశంకరాచార్య స్వామి **(రహసి స్థితః సన్ ఏకాకీ అసహాయః).**

ధ్యానంలో అన్యుల సహాయము అవసరము లేదు. ఆదుకోవటానికి ఆలంబనంగా ఉండటానికి అచ్యుతుడు అక్కడ సిద్ధం గానే ఉన్నాడు. అదే ధ్యానవైభవము.

కొన్ని విషయాలలో ఇతరుల సహాయం మనకు అవసరం. కాని, ధ్యాన విషయంలో అన్యుల ప్రవేశము అనూహ్యము. పైగా ప్రతిబంధకము కూడా. మూటను తల పైకి ఎత్తడానికి ఇతరులు సహకరించాలి. శ్వాసలను ఆడించడానికి అన్యుల సహాయము మనకు అవసరమా? అక్కడ కూడా అతిప్రేమను కూడ గట్టుకొని అన్యులు ప్రవేశిస్తే, శ్వాసలు ఆడుతాయో, ఆగుతాయో చెప్పలేము. ధ్యానం విషయంలో కూడా ఇతరుల ప్రమేయం ఇలాగే ఉంటుంది.

కనుక ధ్యానయోగి ఒంటరివాడుగా ధ్యానాన్ని కొనసాగించాలి. ధ్యానానికి ఏకాకిగా ప్రవేశించాలి. ధ్యానంలో ఏకాకిగా ఉండాలి. అంటే, తోడు ఎవరూ ఉండకూడదు. తోడు అనేది మనస్సుకు సంబంధించిన విషయ మని నేను ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదనుకుంటున్నాను.

ఏకాకి మనస్సులో ఎవ్వరూ లేరు. లేకుండా ఉండాలి. సరే. వ్యక్తులు లేరు. విషయాలు ఉండవచ్చా? ఏ విషయాలు? వ్యక్తులకు సంబంధించిన విషయాలే కదా? వ్యక్తులు వేరు - విషయాలు వేరుగా ఉన్నాయా? విషయా లుంటే వ్యక్తులు ఉన్నట్లే. కనుక, ఏకాకి అంటే వ్యక్తులు, విషయాల నుండి విడిపడి యున్నవా డని అర్థం. అప్పుడే ధ్యానం సాగుతుంది. మనస్సును ధ్యానంలో నియమించడ మంటే ఇదే **(యోగీ నియత మానసః - నియతం సంయతం మానసం మనః యస్య సః అయం నియతమానసః).**

ఏ సహాయం లేకుండా, ఎవరి సహాయం లేకుండా తనలో తాను సుఖించడం తెలిసిన వాడు ధ్యానయోగి **(యోన్త సుఖోన్తరారామః).** తన ఆత్మ యందే తాను సుఖించు వాడు, రమించువాడు అని అర్థము **(యః అన్తః సుఖః ఆత్మని సుఖం యస్య సః అన్తః సుఖః, తథా అన్తః ఏవ ఆత్మని ఆరామః క్రీడా యస్య సః అన్తరారామః).** ధ్యానయోగి ఆత్మ యందే సుఖించేవాడు కావాలి. ఆత్మ యందే విహరించేవాడు కావాలి.

అలా ఉండాలి అంటే, బాహ్యవిషయాలు అతడిని బాహ్యానికి లాగకుండా ఉండాలి. బయట విషయాలు లోపలున్న వ్యక్తిని ఎలా లాగుతాయి? అవి లోపల ఉన్నప్పుడే లోపల సుఖించే వాణ్ణి బాహ్యానికి ఈడుస్తాయి. అలా జరుగకూడ దనేది అభిమత మైతే, బాహ్య విషయాలను లోనికి రానివ్వకుండా బాహ్యం లోనే ఉంచి యోగి ధ్యానంలో ప్రవేశించాలి. పాదరక్షలను గుడి బయట ఉంచి ఆలయం లోకి ప్రవేశించినట్లు, బాహ్య విషయాలను బాహ్యం లోనే ఉంచి ధ్యానం లోకి ప్రవేశించాలి **(స్పర్శాన్ కృత్వా బహిః బాహ్యాన్).**

కాళ్ళకు చెప్పుల్ని తొడుక్కుంటామే గాని చెప్పులకు కాళ్ళు లేవు. కనుక, ఎక్కడ మనం విడిస్తే, అక్కడే కదలకుండా పడి ఉంటాయి. కాని, విషయాలు వేరు. వాటికి రెక్క లున్నాయి. రెక్కల్ని ఆడిస్తూ గగన విహారం చేస్తాయి. హృదయాకాశం లోకి చొచ్చుకొని వస్తాయి. అప్పుడేమి చెయ్యాలి?

ధ్యానంలో ధ్యానయోగి ఏదో చేసేవాడు కాడు. ఏదీ చేయకుండా ఉండేవాడు. చూస్తూ ఉండాలి. చేస్తూ ఉండకూడదు.

ఆకాశంలో ఎండ ఉంది; నువ్వు చూస్తున్నావు. వాన ఉంది; నువ్వు చూస్తున్నావు. గాలులు వీస్తున్నాయి; నువ్వు చూస్తున్నావు. వెన్నెల ఉంది; నువ్వు వీక్షిస్తున్నావు. ఇవన్నీ ఆకాశం లోనే తెలుస్తున్నాయి. ఇవేవీ లేక పోయినా ఆకాశము ఉంది. ఉంటుంది. వినిర్మలంగా ఉంటుంది. విశుద్ధం గానే ఉంటుంది.

ఎండ తీవ్రంగా ఉంది. వర్షం భయంకరంగా కురుస్తోంది. గాలులు చల్లగా వీస్తున్నాయి; వెన్నెల మసకగా ఉంది - ఇలాంటి మాటలు వినిపిస్తా యేమో గాని, ఆకాశం బాగలేదు అని ఎవ్వరూ అనరు. ఆకాశం మీద ఎవ్వరికీ అభియోగాలు లేవు; ఫిర్యాదులు ఉండవు. అందుకే అది ఆకాశం. అన్నిటికీ అవకాశ మిస్తూ **(అవకాశ ప్రదాతృ)** తన విషయంలో అవకాశ మివ్వని అద్భుతమే ఆకాశము. అందుకే నిరుపమాన మైన పరమేశ్వరుని ఆకాశం తోనే పోల్చారు **(గగన సదృశం).**

ఆకాశం వినిర్మలంగా ఉన్నట్లు ధ్యానయోగి ఆంతర్యం విశుద్ధంగా ఉండాలి. రాగాల వానలో నానకుండా, ద్వేషాల ఎండలో ఎండకుండా, ఈర్ష్యాసూయల చలిలో కుంచుక పోకుండా, వచ్చేవి వచ్చి పడుతున్నా, పోయేవి పరుగు లెత్తుతున్నా, తనలో ఏ చలనం, సంచలనం లేని ఆకాశం లాగా స్థిరమైన, నియతమైన మనస్సు ధ్యానంలో ఉండాలి. ఇక్కడే తనను తాను ప్రశాంతాత్మగా అనుభూతిని పొందడం జరుగుతుంది.

జరగ వలసినవి జరిగాయి. జరగకూడనివి జరగాలని ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. నియతి భగవత్స్వరూపము. దానిని అతిక్రమించడం ఎవరికీ సాధ్యం కాదు.

అవసర మనుకున్నవి దూరమై మన జీవితంలో వాటి అవసరాన్ని కుదించుకున్నాయి. ఇక అవి మనకు అవసరం లేనివి అని మదింపు వేసుకోవాలి. ఉండలేనివే పోతున్నాయి. పారి పోతున్నాయి. ఉండి వెలిగినవే ఉండలేక ఆరి పోతున్నాయి. ఉన్న మనస్సులే మారి పోతున్నాయి. కలసి ఉండలేక కారి పోతున్నాయి. పోయేందుకే వచ్చిన దేహాలు బలహీన పడిపోతున్నాయి.

అన్నిటిలో నియతి ఉంది. నియతిరూపంలో నియంతే ఉన్నాడు. అర్థం చేసుకుంటే ఏదీ ధ్యానానికి అవరోధము కాదు. అర్థం కానపుడు మనకు మనమే అవరోధం. మన మనస్సే మనకు పెనుభూతం.

ధ్యానంలో భూతాలు లేవు. భవిష్యత్తులు మిగలవు. అక్కడ అంతా వర్తమానమే. పరమేశ్వరుని వర్తమానాన్ని ఆలకించడమే. అది కరుణాపూరితమైన తొలకరి. ఆ తరువాత, అంతా వర్షమే. జ్ఞానవర్షమే. ఆచార్యుని అనుగ్రహవర్షమే. **ఓం.**

ఓం స్వామి సుందర చైతన్యానంద







పూజ్య గురుదేవుల ప్రవచనము - సంకీర్తనము







